


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




**కురుబల ఉన్నతే చంద్రబాబు లక్ష్యం**

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

5

## హామీలిచ్చాం.. అమలుచేశాం

- టీంగా పని చేసి.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం
- డబుల్ ఇంజిన్ సర్కారుతోనే సంక్షేమం, అభివృద్ధి
- అక్టోబర్ 4న ఆటో డ్రైవర్ల సేవలో.. పథకం
- ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఒక్కొక్కరికీ రూ.15 వేలు
- స్పష్టం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అసెంబ్లీలో సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీల అమలుపై సమాధానం

2



*"డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంది కనుకే.. 15 నెలల కాలంలో ఇన్ని కార్యక్రమాలను చేయగలిగాం. ప్రధాని మోదీ, పవన్ కళ్యాణ్ సహకారంతో ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తోంది. ఇదో టీం.. ఈ టీంలో ఏ ఒక్కరు తప్పు చేసినా... విఘాతం కలిగించేలా వ్యవహరించినా.. రాష్ట్రానికి నష్టం జరుగుతుంది. ఎమ్మెల్యేలు పర్సనల్ అజెండాలు పెట్టుకుని మాట్లాడితే.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి అడ్డంకి కలుగుతుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.*

## పర్యాటకానికి ఏపీ స్వర్గధామం



- ప్రస్తుతం ఉన్నది ఒక్కటే ఇజం... అది టూరిజం
- పర్యాటకరంగ అభివృద్ధికి ఎంతైనా ఖర్చు చేస్తాం
- 20శాతం వృద్ధిరేటు సాధించడమే ప్రభుత్వ లక్ష్యం
- టూరిజం ప్రాజెక్టులకు సులువుగా అనుమతులు, ప్రోత్సాహకాలు
- భవిష్యత్‌లో కుంభమేళా తరహా ఆధ్యాత్మిక కార్యక్రమాలు
- ఇకపై దసరా అంటే విజయవాడ కూడా గుర్తుకురావాలి
- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- 'రిషికొండ' ఖర్చు టూరిజంపై పెడితే లక్షల ఉద్యోగాలు వచ్చేవని వ్యాఖ్య

3

### న్యాయవిద్య, పరిశోధనలకు..

## అమరావతిలో భారత అంతర్జాతీయ విశ్వవిద్యాలయం

- మంత్రి లోకేష్ ప్రవేశపెట్టిన బిల్లును ఆమోదించిన శాసనమండలి
- ఏపీ ప్రైవేటు వర్సిటీలు, ఏపీ వర్సిటీల సవరణ బిల్లులకూ ఆమోదం

5



## ఏపీ పర్యాటకానికి స్వర్ణయుగం

- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ నేతృత్వంలో తిరిగి మంచిరోజులు
- అనుమతులకు సింగిల్ విండో విధానం
- పెట్టుబడిదారులకు పూర్తి భరోసా
- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో మంత్రి దుర్గేష్



6

## స్వదేశీ నెట్‌వర్క్‌తో కనెక్టివిటీ విప్లవం

- బీఎస్ఎన్ఎల్ దేశంలో ఓ శక్తివంతమైన సంస్థ
- నాలెడ్జి ఎకానమీ దశను యువత అందుకోవాలి
- బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్వర్క్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు

4





### అంతర్జాతీయ ప్రమాణాలతో

## క్యాన్సర్ ఆసుపత్రి

- అమరావతిలో త్వరలో నిర్మాణం పూర్తి చేస్తాం
- విజయవాడ ఉత్సవ్‌కు రావడం సంతోషంగా ఉంది
- దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి
- హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

8

### మత్స్యకారుల అభివృద్ధికి

## కట్టుబడిన ప్రభుత్వం



- వైసీపీ హయాంలో అనేక ఇబ్బందులు
- ఫిష్ ఆంధ్ర పేరుతో దోచుకున్నారు
- అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు

5

## విజయ్ సభలో విషాదం

**36 మంది మృతి**

- తమిళనాడులో టీవీకే అధ్యక్షుడి ప్రచారసభలో తొక్కిసలాట
- పలువురి పరిస్థితి విషమం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

9



చైతన్యరథం

# హామీలిచ్చాం.. అమలుచేశాం

అమరావతి (చైతన్య రథం): "డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంది కనుకే.. 15 నెలల కాలంలో ఇన్ని కార్యక్రమాలను చేయగలిగాం. ప్రధాని మోదీ, పవన్ కళ్యాణ్ సహకారంతో ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తోంది. ఇదో టీం.. ఈ టీంలో ఏ ఒక్కరు తప్పు చేసినా... విఘాతం కలిగించేలా వ్యవహరించినా.. రాష్ట్రానికి నష్టం జరుగుతుంది. ఎమ్మెల్యేలు పర్సనల్ అజెండాలు పెట్టుకుని మాట్లాడితే.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి అడ్డంకి కలుగుతుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం అసెంబ్లీలో సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీల అమలు చర్చలో ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించనున్నట్టు సభలో సీఎం ప్రకటించారు. రాష్ట్రాభివృద్ధి విషయంలో కలిసి కట్టుగా పని చేయాలని ప్రజా ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... "టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలిసి ఎన్నికలకు వెళ్లాయి. అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలన ద్వారా రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తామని నాడు చెప్పాం.. నేడు చేసి చూపుతున్నాం. కలిసి ఉన్నాం కాబట్టే... ఇవన్నీ చేయగలుగుతున్నాం. దీన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. అక్టోబర్ 4న 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రారంభిస్తున్నాం. ఈ పథకం కింద సొంత వాహనం కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.15 వేల చొప్పున అందిస్తాం. ఈ పథకానికి అర్హులుగా 2,90,234మంది డ్రైవర్లున్నారు. ఏదైనా కారణాలతో లబ్దిదారుల జాబితాలో అర్హులైనవారి పేరు లేకపోతే... వారి సమస్యలను పరిష్కరించి వారినీ లబ్దిదారుల జాబితాలో చేరుస్తాం. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఆటో డ్రైవర్ల సేవలో స్కీంను వర్తింపచేస్తాం. ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి యేటా రూ.435 కోట్ల ఖర్చవుతుంది. గత ప్రభుత్వం రూ.12 వేలు మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం రూ.15 వేలు అందించేందుకు నిర్ణయించింది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

### ఆలోచించి పేదల సేవలో.. పేరు పెట్టాం

"ప్రతినెలా ఇచ్చే ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు ఎంతో ఆలోచించి పేదల సేవలో.. అని పేరు పెట్టాం. ప్రతి నెల ఫించన్లు అందించే కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతృప్తినిస్తోంది. ఎన్టీఆర్ భరోసా కార్యక్రమం కింద పెద్దఎత్తున ఫించన్లు ఇస్తున్నాం. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో ఇవ్వనన్ని ఫించన్లను మన రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఫించన్లను ఇవ్వకుండా వృద్ధులను ఇబ్బంది పెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. సచివాలయాల ఉద్యోగులు పోటీ పడి తొలిరోజునే 97 శాతం ఫించన్ల పంపిణీని పూర్తి చేస్తున్నారు. నెలకు రూ.2745 కోట్లను ఫించన్లకు ఖర్చు చేస్తున్నాం. మొత్తంగా 63.50 లక్షలమందికి ఫించన్లను పంపిణీ చేస్తున్నాం. ఫించన్లు అందుకుంటున్న వారిలో 59 శాతం మహిళలే. పింఛన్లు ఇవ్వడమే కాదు.. పంపిణీ ఎలా జరుగుతుందన్న అంశంపైనా లబ్దిదారుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నాం. ఏడాదికి రూ.32,143 కోట్లు పెన్షన్ల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఏపీ తర్వాత తెలంగాణ, కేరళ రాష్ట్రాలున్నాయి. తెలంగాణలో ఏడాదికి రూ.8,179 కోట్లు, కేరళ రూ.7295 కోట్లు పెన్షన్ల కింద ఖర్చు పెడుతున్నాయి. అంటే పెన్షన్ల కోసం ఏపీ ఖర్చు పెట్టే దాంట్లో పావు వంతు ఖర్చు పెడుతున్నాయి" అని సీఎం వివరించారు.

### స్త్రీ శక్తి పథకం సంతృప్తినిచ్చింది

"స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకు మహిళలు

- టీంగా పని చేసి.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం
- డబుల్ ఇంజిన్ సర్కారుతోనే సంక్షేమం, అభివృద్ధి
- అక్టోబర్ 4న ఆటో డ్రైవర్ల సేవలో.. పథకం
- ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఒక్కొక్కరికీ రూ.15 వేలు
- స్పష్టం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అసెంబ్లీలో సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీల అమలుపై సమాధానం



8.86 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారు. స్త్రీ శక్తి వల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది. ఉచిత బస్సు స్కీంకు ఏడాదికి రూ.2963 కోట్లను ప్రభుత్వం ఖర్చు పెడుతోంది.. అయినా ఫర్వాలేదు.. ఆనందంగా ఖర్చు పెడతాం. స్త్రీ శక్తి పథకం నాకు సంతృప్తినిచ్చిన పథకం. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు స్త్రీ శక్తి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న 97 శాతంమందికి స్త్రీ శక్తి పథకం గురించి తెలుసు. 85 శాతం స్త్రీ శక్తి పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి పథకం అమలుతో సోషల్ గేదరింగ్ పెరిగింది. మహిళలకు ఉచిత ప్రయాణాల వల్ల డబ్బు కూడా ఆదా అయింది. ఆడబిడ్డల ఆర్థిక ఎదుగుదలకు స్త్రీ శక్తి పథకం తోడ్పడింది" అని సీఎం సంతోషం వ్యక్తం చేశారు.

### తల్లికి వందనం అందని వారుంటే దరఖాస్తు చేసుకోవచ్చు

"తల్లికి వందనం పథకాన్ని సమర్థవంతంగా అమలు చేశాం. ఈ పథకానికి రూ.10,090.74 కోట్లను ఖర్చు పెట్టాం. ఎంతమంది పిల్లలుంటే.. అంతమంది పిల్లలకు తల్లికి వందనం అమలు చేశాం. ఇప్పటికీ తల్లికి వందనం పథకం ఎవరికైనా అందకుంటే వారినుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 2,79,720 మందికి రూ.363.64 కోట్లు అందచేస్తున్నాం. మొత్తంగా తల్లికి వందనం లబ్దిదారులు 66,57,508 మంది విద్యార్థులు ఉన్నారు. దీపం-2.0 పథకం అమలు చేశాం. నా తల్లి వంటింట్లో పడే కష్టాలను చూసి... మరే మహిళా ఆ కష్టాలు పడకూడదని ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం పెట్టాం. ఇప్పుడు దీపం-2.0 పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇప్పటివరకు 2.66 కోట్ల ఉచిత సిలిండర్లు మహిళలకు అందచేశాం. దీని నిమిత్తం రూ.1718 కోట్లను ప్రభుత్వం భరిస్తోంది" అని చంద్రబాబు వివరించారు.

### లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తలు లక్ష్యం

"డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను బలోపేతం చేశాం. డ్వాక్రా మహిళలు పెద్దఎత్తున డబ్బులను పొదుపు చేస్తున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని తిరిగి పూర్తిస్థాయిలో చెల్లిస్తున్నారు. డ్వాక్రా మహిళల్లో కేవలం 1శాతం మాత్రమే ఎన్పీఏలుగా ఉన్నారంటే మహిళా శక్తి ఏంటో అర్థం చేసుకోండి. చాలా పరిశ్రమలు, చాలామంది అప్పులు తీసుకుని ఎన్పీఏలుగా మారుతున్నారు. కానీ డ్వాక్రా సంఘాలు మాత్రం తీసుకున్న అప్పులను నిఖార్సుగా తిరిగి చెల్లిస్తున్నారు. లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. ప్రతి ఎమ్మెల్యే 1000 మంది మహిళలను గుర్తించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలి" అని సీఎం సూచించారు.

### రైతు కుటుంబం నుంచి వచ్చా... రైతులను ఆదుకుంటున్నా

"అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు సాయం అందిస్తున్నాం. రైతు కుటుంబంనుంచి వచ్చాను.. రైతును ఆదుకునే బాధ్యతను తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. రైతుకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చాం. గత ప్రభుత్వం రాష్ట్ర వాటాకింద రూ.7500 ఇస్తే.. కూటమి ప్రభుత్వం రూ.14 వేలు ఇస్తోంది. మూడు విడతల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని పీఎం కిసాన్ పథకంతో జోడించి ఇస్తున్నాం. ఇప్పటి వరకు మొత్తంగా 46.86 లక్షల రైతులకు రూ.3174 కోట్లను అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం అందజేశాం. ఇదేకాకుండా.. రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇన్పుట్ సబ్సిడీ, స్పెషల్ ప్యాకేజీలు ఇస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కేంద్ర ప్రభుత్వాని కంటే మెరుగైన ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. 1.34 లక్షలమంది రైతులకు డ్రిప్ ఇరిగేషన్ను సబ్సిడీపై అందిస్తున్నాం. గత ప్రభుత్వం మార్కెట్ ఇన్వెస్టెన్ ఫండ్ పేరుతో మోసం చేసింది. హెచ్డీ బర్లీ పొగాకు, మామిడి, కోకో, టమాట, కాఫీ తోటలు, మిరప, ఉల్లివంటి పంటలను కొనుగోలు చేశాం. ఉల్లి రైతులను ఆదుకునేందుకు నష్టపోయిన పంటకు హెక్టారుకు రూ.50 వేలు చొప్పున ఇస్తున్నాం. ఇందుకోసం రూ.100 కోట్లు భరిస్తున్నాం. ధాన్యం కొనుగోళ్ల నిమిత్తం రూ.12,858 కోట్లు ఖర్చు పెట్టాం. ఆక్వా రైతులకు రూ.991 కోట్లు భరించి రూ.1.50 లకే విద్యుత్ ఇస్తున్నాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### ఉద్యోగాలకు మొదటి ప్రాధాన్యం

"రాష్ట్రంలోని యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 4,71,574 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం. స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ద్వారా పరిశ్రమలకు మ్యాన్ పవర్ అందించేలా చూస్తాం. ఉద్యోగాల కల్పన ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత. 2014-19 మధ్యకాలంలో అన్న క్యాంటీన్లు పెట్టాం. తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు పెడితే.. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం దాన్ని మరింత అభివృద్ధి చేసింది. కానీ ఏపీలో దౌర్భాగ్యం.. అన్న క్యాంటీన్లను రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక... అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించాం. ఇప్పుడు 204 అన్న క్యాంటీన్లు ఉన్నాయి.. త్వరలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా 70 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటి వరకు అన్న క్యాంటీన్ల ద్వారా 5.72 కోట్ల భోజనాలు పెట్టాం.. రూ.104 కోట్ల మేర సబ్సిడీని అందించాం. ప్రతి దేవాలయంలో అన్నదానం కార్యక్రమం చేపడతాం. రేషన్ షాపుల్లో బియ్యం, పంచదార పంపిణీ చేపడుతున్నాం. దీనికోసం రూ.14,070 కోట్లు ఖర్చు పెడుతున్నాం. రేషన్ మాఫియాను అరికడుతున్నాం. రేషన్ డిపోలను పునఃప్రారంభించాం" అని చంద్రబాబు అన్నారు.

### ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆరోగ్య బీమా

"దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పించే విధానానికి శ్రీకారం చుట్టాం. ఈ తరహా పాలసీ మరే ఇతర రాష్ట్రంలోనూ లేదు. 1.63 కోట్లమంది పేదలకు రూ.25 లక్షల వరకు ఉచితంగా చికిత్సలు అందించేలా పాలసీ రూపొందించాం. మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో భాగంగా ఏడాదికి వేట విరామ సమయంలో రూ.20 వేలు అందిస్తున్నాం. మత్స్యకారులకు ఇబ్బందిగా మారిన జీవో నెంబర్ 217 రద్దు చేశాం. పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్‌లు అందిస్తున్నాం. బీసీలకు సబ్సిడీ మీద, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్‌లు అందిస్తాం" అని సీఎం స్పష్టం చేశారు.

### వచ్చే ఏడాది జూన్‌కు 6.15 లక్షల ఇళ్లు అందుబాటులోకి

"అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇప్పటి వరకు 3 లక్షల ఇళ్లు పూర్తి చేశాం. వచ్చే ఏడాది జూన్‌నాటికి 6.15 లక్షల ఇళ్లను అందుబాటులోకి తెస్తాం. 2029నాటికి ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఇవే కాకుండా.. మేనిఫెస్టో హామీలను చాలావరకు అమలు చేశాం. చెత్తపన్నును రద్దు చేశాం. రైల్వే జోన్ ఏర్పాటయ్యేలా చూశాం. విశాఖకు పెద్దఎత్తున కంపెనీలు తెచ్చాం. అంగన్వాడీలకు గ్రాట్యుటీ పెంచాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

### దేవుళ్ల విగ్రహాలే కదా అని హేళన చేశారు..

"గత ప్రభుత్వంలో రాష్ట్రంలోని చాలా దేవాలయాల్లో అపవిత్ర కార్యక్రమాలకు పాల్పడ్డారు. రామతీర్థంలో రాముని తలనరికేశారు. అంతర్వేదిలో రథాన్ని తగులబెట్టారు. దుర్గమ్మ గుళ్లో వెండి సింహాలను దొంగిలించారు. ఇదేంటని ప్రశ్నిస్తే... విగ్రహాలే కదా వేరే విగ్రహాలు పెట్టుకోండని ఎద్దేవా చేసినట్టు మాట్లాడారు. టీటీడీలో కూడా చాలా అపచారాలు చేశారు. ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తున్నాం. ఉచిత ఇసుక పాలసీలో ఇప్పటికీ కొన్ని అంశాలు నా దృష్టికి వస్తున్నాయి. ఉచిత ఇసుకలో అక్రమాలు చోటు చేసుకోకుండా స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలే చూసుకోవాలి. గత ప్రభుత్వం ఇసుకలో పెద్ద స్కాంకు పాల్పడింది. దేశంలో బెస్ట్ ఎక్సైజ్ పాలసీ తెచ్చాం. వ్యవసాయానికి ఉచితంగా తొమ్మిది గంటల విద్యుత్ అందిస్తున్నాం. ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నాం. ఇంకా పెండింగులో ఉన్న ఉద్యోగుల సమస్యలను త్వరలో తీరుస్తాం. చెప్పిన మాటకు కట్టుబడి అన్నీ చేస్తున్నాం. పీ4లో భాగంగా స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపు నిచ్చాం. మొత్తంగా 99,822 మంది మార్గదర్శులు 9,68,513 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నారు. ఆర్థిక అసమానతలు తగ్గించడానికి పీ4 వేదిక. 2047నాటికి స్వర్ణాంధ్ర సాధన దిశగా అందరూ పని చేయాలి" అని సీఎం కోరారు.

### ఊపిరి ఉన్నంతకాలం పేదల కోసమే పని చేస్తా

"ఇప్పటి వరకు 14సార్లు తిరుమల వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించాను. ఎవ్వరికీ దక్కని అదృష్టం నాకు దక్కింది. పెద్దఎత్తున క్లైమోర్ మైన్లు పెట్టి నన్ను హతమార్చాలని చూశారు. వేంకటేశ్వరస్వామి ప్రాణభిక్ష పెట్టాడు. ఊపిరి ఉన్నంత కాలం పేదల కోసమే పని చేస్తా. పేదల కోసమే అనునిత్యం ఆలోచన చేస్తున్నాను. రాష్ట్రాన్ని పునర్నిర్మించడం.. తెలుగు జాతిని నెంబర్-1 రాష్ట్రంగా చేయడానికి నేను పని చేస్తున్నాను. అలాగే అందరూ పని చేయాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

# పర్యాటకానికి ఏపీ స్వర్గధామం

- ప్రస్తుతం ఉన్నది ఒక్కటే ఇజం... అది టూరిజం
- పర్యాటకరంగ అభివృద్ధికి ఎంతైనా ఖర్చు చేస్తాం
- 20శాతం వృద్ధిరేటు సాధించడమే ప్రభుత్వ లక్ష్యం
- టూరిజం ప్రాజెక్టులకు సులువుగా అనుమతులు, ప్రోత్సాహకాలు
- భవిష్యత్‌లో కుంభమేళా తరహా ఆధ్యాత్మిక కార్యక్రమాలు
- ఇకపై దసరా అంటే విజయవాడ కూడా గుర్తుకురావాలి
- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- 'రిషికొండ' ఖర్చు టూరిజంపై పెడితే లక్షల ఉద్యోగాలు వచ్చేవని వ్యాఖ్య




విజయవాడ (చైతన్య రథం): రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మార్చే శక్తి పర్యాటక రంగానికి ఉందని, టూరిజం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా ఇచ్చామని గుర్తుచేస్తూ.. పర్యాటక రంగ అభివృద్ధితోపాటు, టూరిస్టులను ఆకర్షించేందుకు మెరుగైన పాలసీ తెచ్చి.. ప్రత్యేక ప్యాకేజీలు, రాయితీలు ఇస్తున్నామన్నారు. ప్రపంచంలో ఎక్కువమంది పర్యాటకులు మన దేశీయులేనని, మన దేశంలో ఉన్నన్ని పర్యాటక కేంద్రాలు ప్రపంచంలో మరెక్కడా లేవన్నారు. పర్యాటకులను ఆకర్షించగలిగితే భారీగా ఆదాయం వస్తుందని సీఎం తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. టూరిజం పాలసీ ఆపరేషనల్ గైడ్‌లైన్స్ విడుదల చేశారు. ఏపీ టూరిజం హోంస్టే పోర్టల్‌ను ప్రారంభించారు. బాపట్లలోని గోల్డెన్ సాండ్ రిసార్ట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. హోం స్టే ప్రాజెక్టులకు సంబధించి పలు జిల్లాల్లోని గిరిజనులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి మాట్లాడారు.

## ఒకప్పుడు దేవాలయాలకు వెళ్లడమే పర్యాటకం

తమ చిన్నతంలో గుడికి వెళ్లి రావడమే పర్యాటకమని, అదే గొప్ప అనుభూతినిచ్చేదని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. నేడు ఎన్నో మార్పులు వచ్చాయని... పలు దేశాల ఆర్థిక వ్యవస్థలను టూరిజం శాసిస్తోందన్నారు. మకావ్, మాల్దీవులు, హాంగ్‌కాంగ్‌వంటి దేశాలు ప్రపంచ టూరిస్టులను ఆకర్షిస్తున్నాయన్నారు. ఆ దేశాల జీడీపీలో అత్యధిక షేర్ పర్యాటక రంగానిదేనని వివరించారు. అమెరికా జీడీపీలో పర్యాటక రంగం వాటా 2.36 ట్రిలియన్ డాలర్లు ఉంటే... మన దేశ జీడీపీలో కేవలం 231బిలియన్ డాలర్లు మాత్రమేనని తెలిపారు. నేటి టెక్నాలజీ యుగంలో ఉద్యోగాలు తగ్గిపోతాయని కొందరు భయపడుతున్నారని... టెక్నాలజీని అభివృద్ధి చేస్తూనే టూరిజంపై దృష్టి పెడితే భారీగా ఉద్యోగ కల్పన సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పర్యాటకరంగంలో ప్రతీ రూ.లక్ష పెట్టుబడికి 10 ఉద్యోగాలు సృష్టించవచ్చని సీఎం చంద్రబాబు సూచించారు.

## పర్యాటకానికి కొత్త శోభ

కూటమి ప్రభుత్వంలో పర్యాటకానికి కొత్త శోభ వచ్చిందని చంద్రబాబు అన్నారు. 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చాక అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని గుర్తు చేశారు. ఈ క్రమంలో పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పించామని చెప్పారు. హోటళ్లకు కూడా ఇండ్రస్ట్రీ స్టేటస్ ఇచ్చి ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తున్నామని సీఎం గుర్తు చేశారు. దీని ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయని... భవిష్యత్తులో కుంభమేళా తరహాలో పర్యాటక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించాలని ప్రణాళిక రూపొందిస్తున్నా మని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ రోజుల్లో హోమ్ స్టే నిర్వహణ అనేది స్మార్ట్ వర్కులో విధానంగా ఉంటుందనేది తన భావనగా చెప్పారు. విశాఖలో గిరిజన ప్రాంతాల్లో ఒక మహిళ టూరిజం ద్వారా నెలకు రూ.50 వేలు సంపాదిస్తోందని... కోనసీమలో ఓ వ్యక్తి తన తండ్రికట్టిన 80 ఏళ్లనాటి ఇంటి ప్రాముఖ్యతను పర్యాటకులకు వివరిస్తూ ఉపాధి పొందుతున్నాడని సీఎం వివరించారు. ప్రపంచంలోనే అందమైన పర్యాటక ప్రదేశాలు మన రాష్ట్రంలో ఉన్నాయని... పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఏపీ టూరిజం పాలసీ 2024-29 తీసుకు వచ్చామని చెప్పారు. స్టాంప్ డ్యూటీ మినహాయింపు... కేపిటల్ సబ్సిడీ, ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, విద్యుత్ రాయితీలతో పాలసీని ఆకర్షణీయంగా రూపొందించడమే కాకుండా పర్యాటక రంగంలో కొత్త అవకాశాలు సృష్టించామని ముఖ్యమంత్రి తెలిపారు.

## 103 ఎంవోయూలు - రూ.10,644 కోట్ల పెట్టుబడులు

కూటమి ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లో పర్యాటక రంగంలో 103 ప్రాజెక్టులకు ఎంఓయూలు కుదుర్చుకున్నామని, దీనివల్ల రాష్ట్రానికి రూ.10,644 కోట్ల పెట్టుబడులు రానున్నాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో తాజ్, ఒబెరాయ్, ఐటీసీ సహా అనేక సంస్థలు తమ ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నాయని వెల్లడించారు. రాబోయే నాలుగేళ్ల కాలంలో 50 వేల గదుల ఏర్పాటే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇప్పటికే విశాఖ, అరకు, కోనసీమ, తిరుపతి, రాజమండ్రిలో 10,000కు పైగా హోమ్‌స్టేలు ఉన్నాయని... వాటిని టూరిజం అభివృద్ధికి వినియోగించుకోవాలని చంద్రబాబు సూచించారు. ఎకో టూరిజం, అడ్వెంచర్ టూరిజం, టెంపుల్ టూరిజంవంటి వాటికి వినియోగించుకోవాలన్నారు. తిరుపతికి రోజుకు సుమారు లక్ష మంది వరకూ భక్తులు వస్తున్నారని... తిరుపతిలో పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తే భక్తులు మూడు రోజుల వరకూ స్టే చేసే అవకాశం ఉంటుందని సీఎం చెప్పారు. టెంపుల్ టూరిజంతోపాటు 40 బౌద్ధ స్థలాలతో అంతర్జాతీయ బౌద్ధ టూరిజంను ఏర్పాటు చేస్తున్నామని సీఎం వివరించారు. కుంభమేళా తరహాలో 100 ఆలయాల్లో టెంట్ సిటీస్‌కు కార్యాచరణ చేపట్టామని... యాంకర్ హబ్‌లుగా విశాఖ, అరకు, రాజమండ్రి, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతి... వారసత్వ ప్రాంతాలుగా కొండపల్లి, కూచిపూడి, ఏటికొప్పాక, మంగళగిరి, ధర్మవరం వంటి ప్రాంతాలను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

## దసరా ఉత్సవాలంటే విజయవాడ గుర్తు రావాలి

నిన్నటి వరకూ దసరా అంటే గుర్తొచ్చేది కలకత్తా, మైసూర్ నగరాలని... ఇకపై విజయవాడ గుర్తుకు వచ్చేలా 'విజయవాడ ఉత్సవ్'ను ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే 8 మెగా ఈవెంట్స్ నిర్వహించామని... గండికోట ఇన్వెస్టర్స్ మీట్, బారువా-మసులా బీచ్ ఫెస్టివల్స్, అరకు చలి ఉత్సవం, ఫ్లెమింగో ఫెస్టివల్, నారీ శక్తి విజయోత్సవ్‌కు మంచి స్పందన వచ్చిందని ముఖ్యమంత్రి చెప్పారు. సీమలో టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేస్తే.... ఉపాధి పెరుగుతుందన్నారు. శ్రీశైలంలో శక్తి పీఠాలున్నాయని... అక్టోబర్ 16న ప్రధాని శ్రీశైలం వచ్చి పూజలు నిర్వహించనున్నట్టు సీఎం వెల్లడించారు. గండికోటలాంటి సుందరమైన ప్రాంతం దేశంలో మరెక్కడా లేదని... ప్రపంచంలో 8వ అందమైన ప్రదేశం గండికోట అని చెప్పారు. కచ్‌వంటి కరువు ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తయారు చేశారని... ఆ స్ఫూర్తితో మరింత ముందుకెళ్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ స్కీంలకింద రాష్ట్రంలో 8 టూరిజం ప్రాజెక్టులను రూ.428 కోట్లతో చేపట్టడం రాష్ట్ర పర్యాటకానికి ఊతమిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు.

## టూరిజం అభివృద్ధికి ఎంతైనా ఖర్చు చేస్తాం

పర్యాటక రంగ అభివృద్ధికి ఎంత డబ్బు అయినా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాజమండ్రిని టూరిజం హబ్‌గా తయారు చేస్తామని చెప్పారు. అఖండ గోదావరి ప్రాజెక్టు ద్వారా రాజమహేంద్రవరం సమీపంలోని గోదావరి పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నా మన్నారు. హేవలాక్ బ్రిడ్జిని ఆధునికీకరిస్తూ అందం గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.విశాఖలో 2 డబుల్ డెక్కర్ బస్సులను ఏర్పాటుచేసి 11 ప్రాంతాలను పర్యాటకులు సందర్శించేందుకు అందుబాటులోకి తీసుకొచ్చామని సీఎం చెప్పారు. విశాఖలో క్రూయిజ్ కూడా ప్రారంభించామన్న చంద్రబాబు... గత ప్రభుత్వంలో అన్ని రంగాలతోపాటు పర్యాటక రంగం కూడా దెబ్బతిందని గుర్తు చేశారు. రిషికొండపై రూ.451 కోట్లతో ప్యాలెస్ కట్టారని... అదే డబ్బు టూరిజంపై ఖర్చుపెట్టి ఉంటే లక్షలమందికి ఉద్యోగాలు వచ్చేవని సీఎం చంద్రబాబు అన్నారు.

## అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు

పర్యాటక రంగంలో మార్కెటింగ్ ఎంతో ముఖ్యమైనదని సీఎం చంద్రబాబు తెలిపారు. మనగురించి మనం చెప్పుకుంటే తప్పు లేదన్నారు. మన వివిధ వంటలు, అద్భుతమైన ఆహారం ఎక్కడా దొరకదన్నారు.అలాగే ఆలయాలు, నదీ తీర ప్రాంతాలు, అడవులు, కొండలు... ఇలా ఏపీలో అన్నీ ఉన్నా యన్నారు.ఆయా ప్రాంతాలను ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రమోట్ చేయాలని సీఎం సూచించారు. అరకు కాఫీ అనుభూతిని ప్రపంచానికి చెప్పగలిగేలా ప్రధానితో అరకు కాఫీ తాగించామని సీఎం చెప్పారు. కోనసీమ లో వాడపల్లి దేవాలయానికి ఇప్పుడు భక్తులు పోటెత్తు తున్నారని చెప్పారు. ఆదాయం పెరిగేలా పర్యాటకుల ను ఆకర్షించాలన్నా, వారు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నా ఆయా రాష్ట్రాల్లో శాంతి భద్రతలూ ముఖ్యమేనని సీఎం చంద్రబాబు అన్నారు.

## పర్యాటకంలో 20శాతం వృద్ధిరేటు లక్ష్యం

8 శాతం గ్రోత్ ఉన్న పర్యాటకాన్ని 20 శాతానికి పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. స్వర్ణాంధ్ర-2047నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దేశంలో అగ్రభాగాన నిలపాలని... దీనిలో పర్యాటక రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు.

మన కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలకు మంచి మార్కెట్ లభిస్తుందని వివరించారు. మన చేనేత ఉత్పత్తులు, మన కలంకారీ వస్తువులకు డిమాండ్ పెరుగుతుందని... దీనివల్ల ఆయావర్గాల ప్రజల ఆదాయం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి దుర్గేష్, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, స్థానిక ప్రజా ప్రతినిధులు, టూరిజం శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.








చైతన్యరథం

# స్వదేశీ నెట్‌వర్క్‌తో కనెక్టివిటీ విప్లవం

- బీఎస్ఎన్ఎల్ దేశంలో ఓ శక్తివంతమైన సంస్థ
- నాలెడ్జి ఎకానమీ దశను యువత అందుకోవాలి
- బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్వర్క్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు



బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ పారంభోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ కేశినేని శివనాథ్, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

అమరావతి (చైతన్య రథం): స్వదేశీ 4జీ నెట్‌వర్క్‌తో దేశంలో కనెక్టివిటీ విప్లవం సాధ్యమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దేశీయంగా తయారు చేసుకున్న సాంకేతికతతో దేశంలోని మారుమూల ప్రాంతాలన్నీ అనుసంధానం కావటం ప్రగతికి సూచికగా అభివర్ణించారు. శనివారం విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్వర్క్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి సత్యకుమార్ యాదవ్, బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఒడిశాలోని ఝార్సుగూడ నుంచి ప్రధాని మోదీ ప్రారంభించిన స్వదేశీ 4జీ నెట్వర్క్ కార్యక్రమంలో సీఎం వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశంలోని 97,500 ప్రాంతాల్లో 4జీ స్వదేశీ నెట్‌వర్క్‌ను బీఎస్ఎన్ఎల్ అందించనుంది. ఏపీలోని 10 మారుమూల గ్రామాలు సహా దేశవ్యాప్తంగా 108 గ్రామాల్లో 4జీ సేవలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. నడిపించే నాయకుడు లేక దేశం ఇన్నాళ్లూ అవస్థలు పడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. దేశానికి సరైన నేతగా ప్రధాని మోదీ సరైన స్థానంలో ఉన్నారన్నారు. అందుకే స్వదేశీ 4జీ నెట్‌వర్క్‌లాంటి విప్లవాత్మక మార్పులు దేశంలో చోటుచేసుకుంటున్నాయని సీఎం వ్యాఖ్యానించారు. 1995నుంచి దేశం టెక్నాలజీపరంగా, సమాచార సాంకేతిక అంశాల్లో ముందుకు వెళ్లాలని కలగన్నానని.. అదిప్పుడు సాకారమవుతోందని సీఎం తెలిపారు. గతంలో టెలికామ్ రంగంలో ఇచ్చిన నివేదికతో ఇప్పుడు ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు.

డీ రెగ్యులేషన్‌లాంటి సంస్కరణలు ఈ మార్పునకు కారణమని స్పష్టం చేశారు. ఒక బిలియన్ సబ్ స్క్రైబర్లు కలిగిన కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌తో బీఎస్ఎన్ఎల్ దేశంలోనే ఓ శక్తివంతమైన సంస్థగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1 లక్ష 4జీ సైట్లను ఏర్పాటు చేసి 4 పెటా బైట్ల డేటాను ప్రతీ రోజూ అందించటం అభినందనీయమన్నారు. మొత్తం 26,707 మారుమూల గ్రామాలను 4జీ టెక్నాలజీతో అనుసంధానించటం దేశ ప్రగతికి మరో కీలకమైన ముందడుగు అవుతుందన్నారు. 4జీ స్టాక్ తయారు చేసుకున్న అతితక్కువ దేశాల్లో భారత్ ఒకటిగా మారటం చారిత్రాత్మకమని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా బీఎస్ఎన్ఎల్‌కు ప్రధాని మోదీ అదనపు నిధులు కేటాయించి శక్తివంతంగా తయారుచేశారని ప్రశంసించారు. భారత్‌లో తయారైన కోవిడ్ వాక్సిన్ వంద దేశాల్లోని వారినీ కాపాడిందని సీఎం వ్యాఖ్యానించారు. ఆ సమయంలోనే తీసుకువచ్చిన యూపీఐ డిజిటల్ పేమెంట్స్ విధానం ఇప్పుడు ఫ్రాన్స్, సింగపూర్‌లాంటి దేశాల్లోనూ వాడుతున్నారన్నారు. భారత్ తయారు చేసిన చాలా ఉత్పత్తులు, సాంకేతికతను విదేశాలు వినియోగిస్తున్నాయని సీఎం అభినందించారు.

## నాలెడ్జ్ ఎకానమీతోనే సంపద

ప్రస్తుతం ప్రపంచమంతా నాలెడ్జ్ ఎకానమీ దశలో ఉందని.. దీనిని మనదేశ యువత అందిపుచ్చుకోవాలని అప్పుడే సంపద సృష్టి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీలో మొబైల్ ఫోన్ ద్వారా 735 పౌరసేవలను వాట్సప్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. 4జీలాంటి సేవల ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా దేశంలో తయారైన సెల్‌ఫోన్లు ప్రపంచ దేశాలు వాడుతున్నాయన్నారు. రాష్ట్రంలోని 14.30 లక్షల పైచిలుకు డ్వాక్రా గ్రూపులకు చెందిన మహిళలు స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్నారని వివరించారు. స్మార్ట్ ఫోన్ కారణంగా ఆర్థిక పరిస్థితులు, జీవన ప్రమాణాలు పెరిగాయని స్పష్టం చేశారు. 2030 నాటికి 6జీ కూడాఅందుబాటులోకి వచ్చేస్తుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీలు ఇప్పుడు రియాలిటీలోకి వచ్చేశాయని.. 2026 జనవరినాటికి అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ రకరకాల యాప్స్ ద్వారా 90 శాతం విదేశీ కంపెనీలకు డబ్బు చెల్లిస్తున్నామని, ఈ పరిస్థితి మారాలని సీఎం పిలుపునిచ్చారు. పేటెంట్స్ కూడా గరిష్టంగా నమోదు కావాలని అన్నారు. 2047నాటికి ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుం దని.. భారతీయులు, తెలుగువాళ్లు నెంబర్-1గా ఎదగాలని సీఎం ఆకాంక్షించారు. అలాగే బీఎస్ఎన్ఎల్ నుంచి మరిన్ని కొత్త ఆవిష్కరణలు రావాలని.. వినియోగదారులకు మరింత మెరుగ్గా ఆ సంస్థ సేవలు అందించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.



*అమరావతి శాసనసభ ప్రాంగణంలో ఎమ్మెల్యేలు తీసుకున్న గ్రూప్ ఫోటోను శనివారం స్పీకర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అందచేస్తున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు. కార్యక్రమంలో శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, చీఫ్ విప్ ఆంజనేయులు పాల్గొన్నారు.*




విజయవాడ గురునానక్ కాలనీలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలెప్మెంట్ ప్లానింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలపర్తి వీఆర్ కుమార్తె సాయిసుధ నిశ్చితార్థ వేడుకకు హాజరై కాబోయే దంపతులు సాయిసుధ, చైతన్యలను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## న్యాయవిద్య, పరిశోధనలకు..

# అమరావతిలో భారత అంతర్జాతీయ విశ్వవిద్యాలయం

- మంత్రి లోకేష్ ప్రవేశపెట్టిన బిల్లును ఆమోదించిన శాసనమండలి
- ఏపీ ప్రైవేటు వర్సిటీలు,ఏపీ వర్సిటీల సవరణ బిల్లులకూ ఆమోదం



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిలో అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేశామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ మేరకు శాసనమండలిలో శనివారం న్యాయ విద్య, పరిశోధనకు భారత అంతర్జాతీయ విశ్వవిద్యాలయం బిల్లు (ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ద బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఎట్ ద ఆంధ్రప్రదేశ్ బిల్-2025), ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, సవరణ బిల్లుతో పాటు ఏపీ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు-2025ను మంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టారు. ఆయా బిల్లులకు మండలి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) 1986లో నేషనల్ లా స్కూల్ ను బెంగళూరులో ఏర్పాటుచేసిందన్నారు. ఇదొక మోడల్ లా యూనివర్సిటీ. దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇలాంటి సంస్థలను అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటుచేయాలని 1993లో జరిగిన ప్రధాన న్యాయమూర్తుల కాన్ఫరెన్స్‌లో తీర్మానించారు. ఇందుకు బీసీఐ ఒక ట్రస్ట్‌ను ఏర్పాటుచేసింది. ఇందులో భాగంగా ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌ను గోవాలో ఏర్పాటుచేశారు. ఈ బోర్డులో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు ఉన్నారు. రాష్ట్రానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో గవర్నర్ ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్లే ఈ యూనివర్సిటీని సాధించుకోగలిగాం. అమరావతిలో అంతర్జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. యూనివర్సిటీతో పాటు ఆర్బిట్రేషన్ సెంటర్, మీడియేషన్ అండ్ కన్సల్టేషన్ సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ లీగల్ ఎడ్యుకేషన్, జ్యుడీషియల్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. ఇందుకోసం ప్రత్యేకంగా కూటమి ప్రభుత్వం అమరావతిలో 55 ఎకరాలను కేటాయించింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటిస్తాం. ఏపీ విద్యార్థులకు 25శాతం సీట్లు రిజర్వ్ చేశాం. మరోవైపు కూటమి ప్రభుత్వం వచ్చాక కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటుచేస్తామని గతంలో హామీ ఇచ్చాం. ఆ ప్రక్రియ కూడా ప్రారంభించాం, పూర్తిచేస్తాం. అక్కడ కూడా ఆర్బిట్రేషన్ సెంటర్ ను ఏర్పాటుచేస్తామన్నారు.

### ప్రైవేటు వర్శిటీల ఏర్పాటుకు..

ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, సవరణ బిల్లును మంత్రి లోకేష్ మండలిలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏపీలో ప్రైవేటు యూనివర్సిటీల కోసం 11-02-2016లో ప్రత్యేక చట్టం చేశారు. అందులో ప్రధానంగా గ్రీన్ ఫీల్డ్, బ్రౌన్ ఫీల్డ్ కేటగిరీలు చేశారు. ఈ చట్టం కింద 14 ప్రైవేటు యూనివర్సిటీలు రాష్ట్రానికి వచ్చాయి. ఈ యాక్ట్ కు 2023లో సవరణ చేశారు. ఆ సవరణలో టాప్ -100 గ్లోబల్ యూనివర్సిటీలతో జాయింట్ సర్టిఫికేషన్ డిగ్రీ ఉంటేనే అనుమతించాలని నిబంధన పెట్టారు. యూజీసీ 2022 రెగ్యులేషన్ లో జాయింట్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఎలిజిబిలిటీ క్రైటీరియా ఇచ్చారు. న్యాక్ గ్రేడింగ్ 3.0 కంటే ఎక్కువ ఉండాలి, లేకపోతే కనీసం మూడు గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్‌లు ఉండాలి, ఎన్ఐఆర్ ఎఫ్ ర్యాంకింగ్స్ లో టాప్-100లో ఉండాలి అంటూ అనేక నిబంధనలు పెట్టారు. దీనివల్ల గ్రీన్ ఫీల్డ్ యూనివర్సిటీలు న్యాక్ కు అర్హత సాధించాలంటే కనీసం నాలుగేళ్ల నుంచి ఆరేళ్లు పడుతుంది. త్వరితగతిన జాయింట్ డిగ్రీ అనేది కుదరదు. మనం చేసిన చట్టం ఏకంగా యూజీసీ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉంది. దీనివల్ల విదేశీ యూనివర్సిటీలు దేశానికి రావాలన్నా, రాష్ట్రంలో యూనివర్సిటీలు ప్రారంభించాలన్నా ఇబ్బందిగా ఉంది. దీంతో జాయింట్ సర్టిఫికేషన్ డిగ్రీని తొలగించి.. మన విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్య అందించాలి, ఉన్నత విద్యను పెద్దఎత్తున ప్రోత్సహించాలి, ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ సవరణ బిల్లును తీసుకువచ్చామన్నారు. ఏపీ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు-2025ను కూడా మంత్రి శాసనమండలిలో ప్రవేశపెట్టారు. అదే విధంగా కుష్టువ్యాధి అనే పదం తొలగించేందుకు సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఆయా బిల్లులను శాసనమండలి ఆమోదించింది.

# మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడిన ప్రభుత్వం

- వేట నిషేధభృతి రూ.20 వేలకు పెంచాం
- వైసీపీ హయాంలో మత్స్యకారులకు అనేక ఇబ్బందులు
- ఫిష్ ఆంధ్ర పేరుతో దోచుకున్నారు
- డెయిరీల్లో అక్రమాలపై విచారణ అనంతరం చర్యలు
- అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడిఉందని వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధకశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శాసనసభలో శనివారం మత్స్యకారుల అభివృద్ధి, పలు డెయిరీల అవినీతిపై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. 2014-2019 తెదేపా ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు స్వర్ణయుగం అన్నారు. రూ.4000 వేట నిషేధ భృతిని అందచేశాం. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో రూ.20,000 అందచేస్తున్నాం. ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి మత్స్యకారులకు కావలసిన మౌలిక సదుపాయాలను వారికి నచ్చిన విధంగా అందచేశాం. వైసీపీ హయాంలో మత్స్యకారులు ప్రత్యక్ష నరకాన్ని అనుభవించారు. మౌలిక వసతులు కల్పించలేకపోవడంతో మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకానికి తూట్లు పొడిచి వైసీపీ ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర పేరుతో దోపిడికి తెగబడింది... ఫిష్ ఆంధ్ర కోసం రూ.155.69 కోట్లు ఖర్చు చేస్తున్నామని, కేవలం రూ.51.44 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం వెనుక మర్మమేమిటి. ఫిష్ ఆంధ్ర పేరుతో నాలుగు అద్దాలు, ఫ్రిజ్ పెట్టి ఏర్పాటు చేసిన 8 పెద్ద షాపులలో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. ఒక్కోదానికి రూ.1 కోటి చొప్పున ఖర్చు చేశారు. ఒక్కో షాపునకు రూ. 50 లక్షల వ్యయం చేసి 36 మధ్యరకం షాపులు ఏర్పాటు చేస్తే 5 మాత్రమే పనిచేస్తున్నాయి. అదేవిధంగా ఒక్కోదానికి రూ.20 లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన 15 చిన్న షాపుల్లో 2 మాత్రమే పనిచేస్తున్నాయంటే వైసీపీ ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతుంది. ఫిష్ ఆంధ్ర వల్ల మత్స్యకారులకు ఎలాంటి ఉపయోగం లేదు. నగదు దోచుకునేందుకు జగన్ వేసిన పథకం ఇది. వైసీపీ హయాంలో పెట్టిన రూ.16 కోట్ల డీజిల్ సబ్సిడీ బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించింది, ఇటీవల మరో రూ.7 కోట్ల సబ్సిడీ నగదును మత్స్యకారులకు అందచేశాం. వైసీపీ హయాంలో ప్రమాదాలకు గురై మరణించిన 63 మంది మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం వచ్చాక పరిహారాన్ని అందచేసింది. మృతి చెందిన మరో 100 మందికి త్వరలోనే పరిహారాన్ని అందచేస్తాం. వైసీపీ పాలనలో అధ్వానంగా తయారైన మత్స్యకారుల జీవితాల్లో పూర్వవైభవం తీసుకొస్తున్నాం. వారికి కావలసిన మౌలిక సదుపాయాలను వారికి నచ్చిన విధంగా అందచేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో రూ.4000 ఖర్చుతో ప్రతి బోట్ కు శాటిలైట్ ట్రాన్స్పాండర్‌లను ఏర్పాటు చేసాం. వాటి వలన చేపలు ఎక్కడ ఉన్నాయో సులువుగా తెలుసుకొవచ్చు. ప్రమాదాలను ముందుగానే గుర్తించవచ్చు. ఎన్ ఎఫ్ డీ బీ ఇన్సూరెన్స్ పథకంలో భాగస్వామ్యం అయ్యి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు రూ.10 లక్షలు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. లోతట్టు ప్రాంతాలలో జీవించే మత్స్యకారులకు అన్ని సదుపాయాలను అందచేస్తాం.

సీడ్, వీడ్ కల్చర్ అభివృద్ధికి చర్యలు చేపట్టాం.. ఇప్పటికే విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సీడ్ కల్చర్ అభివృద్ధి చేసేందుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయి.. పనులు ముందుకు సాగుతున్నాయి. కేజ్ కల్చర్‌ను కూడా అభివృద్ధి చేస్తాం

రాష్ట్రంలోని పలు పాల డెయిరీల అవినీతిపై చర్యలకు సిద్ధమవుతున్నాం. విజయ, విశాఖ డెయిరీల్లో జరుగుతున్న అక్రమాలను నిగ్గుతేల్చేందుకు అధికారులను నియమించి ఎంక్వైరీ చేస్తున్నాం. త్వరలోనే నివేదిక వస్తుంది. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## కురుబల ఉన్నతే చంద్రబాబు లక్ష్యం

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



అమరావతి (చైతన్యరథం): కురుబలను రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నత స్థితిలో నిలపడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవంద్రప్ప, ఆ సామాజిక వర్గీయులు శనివారం కలిశారు. పలు సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కురుబలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నత స్థానాల్లో నిలిపేలా కురుబలను ప్రోత్సహిస్తున్నారన్నారు. గతేడాది జరిగిన ఎన్నికల్లో కురుబలకు అధిక ప్రాధాన్యమిచ్చారని, ఎంపీలుగా ఇద్దరిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించారని తెలిపారు. కేబినెట్‌లో కూడా బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల బాధ్యతలు కురుబ సామాజిక వర్గానికి చెందిన తనకు అప్పగించారని తెలిపారు. ఈ పదవుల కేటాయింపే కురుబలపై సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. కురుబల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి సవితను కురుబ సామాజిక వర్గీయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కురబ సంక్షేమ సంఘ ప్రతినిధులు బెల్లెరెడ్డి ప్రసాద్, కార్యదర్శి మేజారి సదాశివ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు అండగా ప్రభుత్వం

**- శాప్ చైర్మన్ రవినాయుడు**

విజయవాడ (చైతన్యరథం): క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 6 వ అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ టోర్నమెంటును బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, శాప్ బోర్డు మెంబర్ సంతోష్‌తో కలిసి శనివారం రవి నాయుడు ప్రారంభించారు. అనంతరం రవి నాయుడు మాట్లాడుతూ.. క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం, శాప్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. సాఫ్ట్ టెన్నిస్ క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న అనూషకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# ఏపీ పర్యాటకానికి స్వర్ణయుగం





- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ నేతృత్వంలో తిరిగి మంచిరోజులు
- అనుమతులకు సింగిల్ విండో విధానం
- పెట్టుబడిదారులకు పూర్తి భరోసా
- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ (చైతన్యరథం): ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో ఏపీలో పర్యాటక రంగానికి స్వర్ణయుగం నడుస్తోందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఉద్ఘాటించారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సరికొత్త విధానాలతో ఏపీ పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత 15 నెలల కాలంలో పర్యాటక రంగంలో రూ. 10,644 కోట్ల పెట్టుబడులు సాధించామన్నారు. పర్యాటక రంగం సుస్థిర మార్పు అనే ఈ ఏడాది థీమ్‌ను సీఎం నేతృత్వంలో నిజం చేస్తున్నాం. ఆయనే మాకు స్ఫూర్తి. 15 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో పర్యాటక రంగానికి పునర్ వైభవం వచ్చిందంటే అందుకు సీఎం చంద్రబాబు నేతృత్వమే కారణం. తొలి నుండి పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారు. సీఎం సూచనలతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పర్యాటకాన్ని వృద్ధి చేస్తున్నాం. 2019-24 కాలంలో పర్యాటక రంగం కుంటుపడింది. ఆనాటి పాలకుల అనాలోచిత విధానాలతో పర్యాటకాభివృద్ధి పూర్తిగా పడకేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీ పర్యాటక రంగానికి పారిశ్రామిక హెూదా కల్పించడం శుభ పరిణామం. కూటమి ప్రభుత్వం ప్రకటించిన 2024-29 పర్యాటక పాలసీకి మంచి స్పందన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అఖండ గోదావరి, గండికోట పర్యాటక ప్రాజెక్టులు, సూర్యలంక బీచ్ అభివృద్ధి, అన్నవరం, అహెూబిలం, సింహాచలం దేవాలయాల అభివృద్ధి, బొర్రా గుహలు, నాగార్జున సాగర్ అభివృద్ధి చేస్తున్నాం. ఏపీ పర్యాటక రంగంలో క్యారవాన్ టూరిజం పాలసీ, హెూమ్ స్టే పాలసీ, ల్యాండ్ పాలసీ, అడ్వెంచర్ పాలసీ, ఎంప్లాయిమెంట్ ఇన్సెంటివ్ పాలసీ ప్రవేశ పెట్టామని మంత్రి దుర్గేష్ తెలిపారు.

## పెట్టుబడిదారులకు పూర్తి భరోసా

ఇన్వెస్టర్లకు గత ప్రభుత్వంలా బెదిరింపులు ఉండవు. పర్యాటకంలో సింగిల్ విండో విధానాలు అమలు చేస్తూ త్వరతగతిన అనుమతులు జారీ చేస్తున్నాం. ఏపీ ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌తో పాటు పర్యాటకాంధ్ర ప్రదేశ్‌గా మారుస్తాం. ఇన్వెస్టర్లు పెట్టుబడులతో వస్తే.. భరోసా కల్పించే బాధ్యత మాది. ఏపీలో పెట్టుబడులు పెడితే ఆదాయంతో పాటు పర్యాటకులకు ఆహ్లాదం అందిద్దాం. ఎక్కడైతే శాంతి భద్రతలు బాగుంటాయో, పర్యాటకం వృద్ధి చెందుతుందో ఆ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఇన్వెస్టర్లు ముందుకొస్తారు. ఏపీలో అలాంటి వాతావరణం కల్పించిన దార్శనికుడు సీఎం చంద్రబాబు నాయుడు. ప్రధాని, సీఎం,డిప్యూటీ సీఎంల నేతృత్వం లో ఏపీ పర్యాటకంగా దూసుకెళుతోంది. ఏపీలోని సముద్ర తీరంలో, ప్రకృతి సహజ సిద్ధ సుందర ప్రాంతాల్లో, చారిత్రత్మాక కోటల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. ఏపీ పర్యాటకానికి మంచి టీమ్ దొరికింది.. వారందరి కృషితో పురోగతి సాధిస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు.

## గ్లోబల్ టూరిజం హబ్‌గా ఏపీ: నూకసాని బాలాజీ

ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మన రాష్ట్రాన్ని గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి అద్భుతమైన ప్రణాళికలు అమలు చేస్తున్నారన్నారు. విశాఖపట్నం, అరకువ్యాలీ, రాజమహేంద్రవరం, తిరుపతి, అమరావతి, గండికోట, శ్రీశైలం ఈ ఏడు ప్రాంతాలను టూరిజం పాలసీలో భాగంగా టూరిజం హబ్ లుగా అభివృద్ధి చేయనున్నామన్నారు.



ఈ రంగంలో 105 ఎంఓయులను ఇప్పటికే చేసుకున్నామని, దీని ద్వారా రూ. 10వేల కోట్ల కుపైగా పెట్టుబడులు రానున్నాయన్నారు. పీపీపీ పద్ధతిలో రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు.

టూరిజం శాఖ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ టూరిజంకు ఇవ్వడం వల్ల ఇండస్ట్రీ హెూదా ఈ రంగం మరింత వృద్ధి చెందుతుందన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కొత్త టూరిజం పాలసీని కూడా తీసుకువచ్చామన్నారు. టూరిజం రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని అన్నారు. సీఎం చంద్రబాబు టూరిజం రంగంలో నూతన ఆవిష్కరణలకు నాంది పలికారన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా విజయవాడ పట్టణంలో విజయవాడ ఉత్సవ్ పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తుండటం హర్షనీయమన్నారు. ఈ ఏడాది విశాఖ, సూర్యలంక తదితర ప్రాంతాల్లో 8 ఉత్సవ్ లు నిర్వహించనున్నామన్నారు. ఉపాధి కల్పనకు టూరిజం రంగం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామని, అలాగే ఈ ఏడాది 20 శాతం గ్రోత్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రపంచ, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా వివిధ కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు.

ముందుగా టూరిజం కార్వాన్ వాహనాల శ్రేణిని సీఎం చంద్రబాబు నాయుడు జండా ఊపి ప్రారంభించారు. అలాగే కేరళ రాష్ట్రంలోని హౌస్ బోట్ ఆపరేటర్స్ తో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. స్వదేశీ దర్శన్ 2.0 స్కీం ఫౌండేషన్ స్టోన్ ను ఆవిష్కరించారు. ప్రదర్శనలో భాగంగా పర్యాటక శాఖ రూపొందించి ప్రదర్శించిన ఏవీ ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏపీ టూరిజం పాలసీ ఆపరేషన్ గైడ్ లైన్స్‌ను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. బాపట్ల గోల్డెన్ శాండ్ బీచ్ ను సీఎం చంద్రబాబు వర్చువల్ గా ప్రారంభించారు. ఏపీ టూరిజం హెూం స్టే పోర్టల్ ను కూడా విడుదల చేశారు. అనంతరం అరకు పాడేరు, అస్సీల్‌మెట్ట (విశాఖపట్నం), కోనసీమలోని మలికిపురం లలోని హెూం స్టే యజమానులతో వర్చువల్ గా మాట్లాడారు. చివరగా రాష్ట్ర పర్యాటక ఎక్సలెన్స్ అవార్డులను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అందచేశారు.

కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీ హెూటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్. వి. స్వామి, రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఛైర్ పర్సన్ పొడపాటి తేజస్విని, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, బాపట్ల జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్, స్టేక్ హెూల్డర్లు, అధికారులు, అవార్డు గ్రహీతలు, తదితరులు పాల్గొన్నారు.

# 4జీ సేవలతో బీఎస్‌ఎన్‌ఎల్‌కు పూర్వవైభవం

- టెలికామ్ రంగంలో సాంకేతిక విప్లవం
- మార్గదర్శకులు వాజ్‌పేయి, చంద్రబాబు, మోదీ
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

విజయవాడ(చైతన్యరథం): బీఎస్‌ఎన్‌ఎల్‌ను ప్రారంభించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని దేశంలోని మారుమూల గ్రామాల్లో సైతం తమ సేవలను విస్తృతం చేయ డానికి, ఆత్మ నిర్భర్ భారత్ (మేక్ ఇన్ ఇండియా) చొరవతో స్వదేశీ 4జీ నెట్‌వర్క్‌ను దేశ వ్యాప్తంగా వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా ఒడిస్సా నుంచి ప్రారంభించారు. విజయవాడలో జరిగిన



కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, సీ.డాట్ సీఈవో ఆర్.కె.ఉపాధ్యాయ, బీఎస్ ఎన్ఎల్ కార్పొరేట్ ఆఫీస్ డైరెక్టర్ వివేక్ బంజాల్ హాజర య్యారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ సాంకేతిక రంగం లో అనూహ్య పరిణామాలను స్వాగతిస్తూ భారతదేశ గతిని శిఖ రాగ్రంలో ఉంచిన ముగ్గురు వ్యక్తుల్లో మొదటి వ్యక్తి టెలికామ్ తలుపులు తెరిచి కనెక్టివిటీకి కొత్తదారులు వేసిన మాజీ ప్రధాని స్వర్గీయ వాజ పేయి.. రెండవ వ్యక్తి ఆధునికత, అభివృద్ధి, సాంకే తికతకు నిదర్శనమైన ముఖ్యమంత్రి చంద్రబాబు..మూడవ వ్యక్తి ప్రధాన మంత్రి మోదీ అని పేర్కొన్నారు. వాజపేయి సాంకే తికత ను కమ్యూనికేషన్ నెట్వర్క్‌ను మొదటిసారిగా ప్రారంభిం చాలని అనుకున్నపుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఛైర్మన్‌గా ఒక కమిటీ వేసి కనెక్టివిటీ, హై స్పీడ్ ఇంటర్నెట్ ఎలా గ్రామ, గ్రామానికి తీసు కువెళ్లాలి, ధరలు తగ్గించడం వంటి అంశాలపై ఖచ్చితమైన రిపోర్టు ఇచ్చిన తర్వాతనే టెలిఫోన్ ఈ విధంగా అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్‌కు పూర్వవైభవం వస్తుందన్నారు.

## ప్రధాని మోదీకి ధన్యవాదాలు

వైద్య, ఆరోగ్య మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీఎస్‌ఎన్‌ఎల్ స్థాపించి 25 సంవత్సరాలైన సందర్భంగా సిల్వర్ జూబ్లీ జరుపుకుంటున్న బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.



కొత్తగా 92,633 పూర్తి స్వదేశీ పూర్తి సేవలను, దేశవ్యాప్తంగా టవర్లను ప్రారంభిస్తున్న మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచం లోనే అత్యధిక ఇంటర్ నెట్ కలిగిన దేశంగా భార తదేశం గుర్తింపు పొందిందని, ప్రతి మారుమూల ప్రాంతానికి కూడా టెక్నాలజీ సేవలు అందించాలన్న ఆకాంక్షతో పని చేస్తు న్న ప్రధానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సీడాట్ సీఈవో ఆర్.కె.ఉపాధ్యాయ మాట్లాడుతూ 15 నెలల వ్యవధిలో భారత్ లో స్వదేశీ 4జీ నెట్‌వర్క్‌ను విస్తరంచి, టెలికామ్ రంగంలో సి డాట్‌ను అగ్రగామిగా నిలిపినందుకు ప్రధాని మోదీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

# చట్టసభలకు ఆయువుపట్టు సంయుక్త కమిటీలు





- సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించాలి
- ఇతర రాష్ట్రాలలో పర్యటనలు చేపట్టాలి
- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

అమరావతి(చైతన్యరథం): అసెంబ్లీ ప్రాంగణంలోని సమావేశమందిరంలో శనివారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు,మండలిచైర్మన్ కొయ్యే మోషన్‌రాజు ఎనిమిది జాయింట్ కమిటీల తొలి సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఈ కమిటీలు ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు జిల్లాల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని చర్చించి పరిష్కార మార్గాలను సూచించాలని చెప్పారు. అవసరమైతే ఇతర రాష్ట్రాలలో కూడా పర్యటనలు చేపట్టాలని తెలిపారు. ఈ కమిటీ వ్యవస్థ అనేది చట్టసభలకు ఒక ఆయువుపట్టు లాంటిది. సభా సమావేశాలు సంవత్సరం పొడవునా జరపటం సాధ్యం కాని పని. ఈ కమిటీలు సభ పని భారాన్ని పంచుకుంటాయి. సంవత్సరం పొడవునా పనిచేస్తాయి. ఈ కమిటీలు శాసనసభ, మండలిలోని ప్రాతినిధ్యాన్ని ప్రతిబింబిస్తూ ప్రభుత్వ పాలనను సమీక్షించి ప్రజలకు న్యాయం జరిగేలా చేయడంలో కీలక పాత్ర వహిస్తాయని పేర్కొన్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, వికలాంగులు వంటి వర్గాల సంక్షేమానికి మనం తీసుకునే చర్యలు నైతిక బాధ్యత మాత్రమే కాదు రాజ్యాంగబద్ధమైన విధి అని పేర్కొన్నారు. వెనుకబడిన, అసూచిత, మైనారిటీ వర్గాల అభివృద్ధిలో, సమస్యల పరిష్కారంలో ఈ కమిటీల ప్రాధాన్యత అపారమైనదని అన్నారు. కమిటీల ఏర్పాటుతో ప్రజా సమస్యలు మరింత సమర్థవంతంగా చర్చకు వస్తాయని, ప్రజాస్వామ్య స్థిరత్వానికి తోడ్పడతాయని తెలిపారు.

# అంతర్జాతీయ మహిళా సాధికారత సదస్సు విజయవంతంగా నిర్వహించారు

### - ప్రజాప్రతినిధులు, అధికారులకు స్పీకర్ అయ్యన్న అభినందనలు



అమరావతి (చైతన్యరథం): ఈ నెల 14, 15వ తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా సాధికారత సదస్సును విజయవంతం చేసిన జిల్లా కలెక్టర్‌ను జిల్లా యంత్రాంగాన్ని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభినందించారు. సదస్సుకు హాజరైన పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన ప్రజా ప్రతినిధులకు ప్రారంభం నుంచి చివరి వరకు ఎక్కడ ఎలాంటి లోటు పాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. భద్రత విషయంలోనూ పకడ్బందీగా వ్యవహరించారన్నారు. రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చినందుకు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, ఎస్.పి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషన్ మౌర్య, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# గత ప్రభుత్వంలో మైనింగ్‌లో అక్రమాలు

- క్వార్ట్జ్ అనుబంధ కేసులపై చర్యలు
- డబ్బు రికవరీకి ప్రయత్నిస్తున్నాం
- అసెంబ్లీలో కొల్లు రవీంద్ర



అమరావతి(చైతన్యరథం): నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలంలోని రుస్తుం, భారత్ గనుల్లో అక్రమ తవ్వకాలపై అసెంబ్లీలో చర్చ జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రుస్తుం మైనింగ్ కంపెనీకి చెందిన లీజులో అక్రమ మైనింగ్ కార్యకలాపాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. అక్రమాలపై చర్యలు తీసుకున్నాం. రుస్తుం గనులకు పేలుడు పదార్థాలు సరఫరా చేసిన వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకుని చర్యలు తీసుకున్నాం. 2023 ఏప్రిల్ నుంచి క్వార్ట్జ్‌కు ఊహించని డిమాండ్ వచ్చింది. ఆ నేపథ్యంలో అధికార సహకారంతో అక్రమ తవ్వకాలు చాలా ఎక్కువగా జరిగాయి. అప్పుడు స్థానికంగా ఉండే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి 16.12.20203 నుంచి 19.12.2023 వరకు అక్రమ తవ్వకాలు జరుగుతున్న క్వార్ట్జ్ క్వారీ వద్ద దర్నా చేశారు. వారిపై హిజ్రాలు సహా రౌడీలతో దాడులు జరిగాయి. గత ప్రభుత్వంలోని పెద్దల సహకారంతోనే దాడులు జరిగాయని కూడా ఆధారాలు చూపించారు. ఆధారాలతో కేంద్ర ప్రభుత్వానికి కూడా సోమిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఆ కేసును కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విచారణ ప్రారంభించి మాజీ మంత్రి కాకాణి సహా 12 మందిపై కేసులు పెట్టి అరెస్టు చేసిందని వివరించారు. క్వార్ట్జ్‌ను 20.02.2025న మేజర్ మినరల్‌గా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. క్వార్ట్జ్ అనుబంధ కేసులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నాం. అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవడంతో పాటుగా, ఆయా సొమ్మును రికవరీ చేసేందుకు కూడా ప్రయత్నిస్తున్నాం. ఓబులాపురం గనుల్లో జరిగిన అవకతవకలపై తాజాగా కోర్టు తీర్పు స్పష్టతనిచ్చింది. చంద్రబాబు చేసిన పోరాటానికి కోర్టు తీర్పు నిదర్శనం. ఓబులాపురం గనుల్లో సీజ్ చేసిన లక్ష టన్నుల ఇనుప ఖనిజం అక్రమంగా తరలించినట్లు కూడా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అక్రమంగా తరలించిన వారిపై కూడా కఠినమైన చర్యలు తీసుకుంటాం. 2019 నుంచి 2024 నాటి వరకు రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఘోరమైన అక్రమాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైనింగ్ రంగాన్ని సంపూర్ణంగా ప్రక్షాళన చేస్తు న్నాం. ఉచిత ఇసుక విధానంతో భవన నిర్మాణ రంగానికి తోడుగా నిలుస్తున్నాం. గత ఐదేళ్ల ఇసుకను వ్యాపారంగా మార్చుకుని భవన నిర్మాణ రంగాన్ని దెబ్బతీశారు. ఎన్జీటీ, సుప్రీంకోర్టు రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక అక్రమ మైనింగ్‌ను ఎండగట్టాయి. సుమారు 1900 అక్రమ కేసులు నమోదు చేసి మైనింగ్ రంగంలో ఉన్న వారిని ముప్పు తిప్పలు పెట్టారు. అలాంటి సమస్యలన్నింటినీ పరిష్కరించు కుంటూ ముందుకు వెళుతున్నాం. రాష్ట్ర అభివృద్ధిలో మైనింగ్ రంగం పాత్రను కీలకంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

# సముద్ర పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు

- గోవా నమూనా అమలుకు చర్యలు
- చీరాల బీచ్‌లకు రోడ్ల అనుసంధానం
- మౌలిక సదుపాయాలకు ప్రతిపాదనలు
- అసెంబ్లీలో మంత్రి కందుల దుర్గేష్



అమరావతి(చైతన్యరథం): సీఎం, డిప్యూటీ సీఎంల నేతృత్వంలో సరికొత్త ఆవిష్కరణలకు ఏపీ టూరిజం శాఖ శ్రీకారం చుట్టిందని శాసనసభలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. చీరాల సముద్ర తీర పర్యాటకాన్ని ప్రోత్సహించి, అభివృద్ధి తీసుకునేందుకు తీసు కుంటున్న చర్యలు, పర్యాటకులకు మౌలిక సదుపాయాల కల్పనపై అసెంబ్లీలో ఎమ్మెల్యే మాలకొండయ్యతో పాటు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. చీరాలలోని వీరభద్ర స్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పురావస్తు శాఖ వద్ద భద్రపరిచిన మూలవిరాట్ విగ్రహాలను ఆలయంలో తిరిగి ప్రతిష్ఠించే కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా వీరభద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం. కోదండరామ స్వామి ఆలయంలో మ్యూజియం ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్ట్స్, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విభిన్న పర్యాటక ప్రక్రియల తో సమగ్ర పర్యటకాభివృద్ధికి బాటలు వేస్తున్నామని వెల్లడిం చారు. 15 నెలల్లోనే 103 సంస్థలతో ఎంవోయూలు, రూ.10,644 కోట్ల పర్యాటక పెట్టుబడులు సాధించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహ కారంతో వివిధ పథకాల ద్వారా రూ.441 కోట్ల నిధులు రాబట్టామని వివరించారు. గోవా పర్యాటకాన్ని అధ్యయనం చేసి ఆ నమూనాను ఏపీలో అమలు చేసి పర్యాటక ఆదాయం పెంపొందేలా చర్యలు తీసుకోనేందుకు కమిటీ వేయాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు మంత్రికి సూచించారు. ఇందుకు మంత్రి మాట్లాడుతూ అమలు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పర్యాటకా భివృద్ధి శూన్యం.. అనాలోచిత నిర్ణయాలతో పర్యాటక రంగం కుదేలైందని పేర్కొన్నారు. గత శాసనసభ సమావేశాల్లో పర్యాటకాభివృద్ధి గురించి చెప్పిన మాటలను ఇప్పటికే 50 శాతం చేతల్లో చూపించామని చెప్పారు. పర్యాటకులకు మౌలిక సదుపాయాల ఏర్పాటుపై సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందిస్తామని, తద్వారా మౌలిక సదుపాయాలకు మరిన్ని నిధులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా రిసార్ట్స్, వాటర్ స్పోర్ట్స్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి కార్యాచరణ ఏర్పాటు చేశామని వివరించారు. హైదరాబాద్ మ్యూజియంలో ఉన్న పంచలోహ విగ్రహాలను విజయవాడ మ్యూజియానికి తరలించేందుకు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అదే విధంగా అద్దంకి శాసనాన్ని చెన్నై మ్యూజియం నుంచి విజయవాడ మ్యూజియానికి తిరిగి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని వివరిం చారు. చీరాల చుట్టుపక్కల ఉన్న బీచ్‌లకు రోడ్డు అనుసంధానంపై రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ విభాగాలతో కలిపి జిల్లా స్థాయి పర్యాటక మౌలిక సదుపాయాల ప్రణాళిక ప్రతిపాదనలు చేపట్టాం. అప్రోచ్ రోడ్లు, పార్కింగ్ సదుపాయాలు, లైటింగ్, పర్యాటకులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో 10,000 హోమ్ స్టేలు ఏర్పాటు చేస్తున్నాం. కారవాన్ టూరిజంను అందుబా టులోకి తెస్తున్నామని వివరించారు.

# కొల్లేరు ప్రజల సమస్యలు పరిష్కరించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- త్వరలో ఉన్నత స్థాయి సమావేశం
- పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకావాలి
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్



అమరావతి(చైతన్యరథం): కొల్లేరు ప్రజల సమస్యలను మానవీయ కోణంతో పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పౌర సరఫరాల మంత్రి, ఏలూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. కొల్లేరు ప్రజల సమస్యలపై జిల్లాకు చెందిన గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో శనివారం రాష్ట్ర సచివా లయంలో తన చాంబర్‌లో మనోహర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు తమ సమస్యలు ప్రస్తావించారు. కొల్లేరు అభయా రణ్యం ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల తాగునీరు, రహదారులు, తదితర ప్రాథమి క సౌకర్యాలు ఏర్పా టుకు అటవీ శాఖ అధికారులు నిబంధనల పేరుతో అడ్డుపడుతున్నారని, జిల్లా సమీక్షా సమావేశాలకు కూడా హాజరుకాకుండా కొల్లేరు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనో హర్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలోని ప్రజలపై మానవీయకోణంతో పరిశీలించాలని సుప్రీంకోర్ట్ ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ దృష్టికి తీసుకువెళ్లి కోరడం జరిగిందన్నారు. జిల్లాలో కొల్లేరు, అటవీ భూముల సరిహద్దులకు సంబంధించిన సమ స్యలపై వెంటనే చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని, అటవీ, ఇరిగేషన్, రెవెన్యూశాఖల అధి కారులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు.

### జాయింట్ ఇన్‌స్పెక్షన్‌తో సరిహద్దులు నిర్ణయించాలి

మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ నూజివీడు నియోజ కవర్గంలో అటవీ భూములకు సంబంధించి సరిహద్దుల సమస్య ఉందని పేర్కొన్నారు. రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి సరిహద్దులు నిర్ణయించాలని కోరారు. ఆర్ఓఎఫ్ ఆర్ భూములకు సంబంధించి రైతులకు పట్టాలు జారీ చేయాలని, వారి భూములలో సాగు చేసుకునేందుకు బోర్ వెల్స్ వేసుకునేందుకు అటవీ శాఖ అధికారులు అనుమతిమంజూరు చేయాలన్నారు. కొల్లేరు, నూజివీడు నియోజకవర్గంలో అటవీ సమస్య లపై తీసుకుంటున్న చర్యలను అటవీ శాఖాధికారులు సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరులోని లంక గ్రామాలలోని ప్రజల తాగునీటి సమస్యలు, రోడ్ల పరిస్థితిని వివరిస్తూ కొల్లేరు ప్రజల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి సమస్యల పరి ష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు తెలియజేసిన సమస్యలపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ ప్రజాప్రతినిధులు తెలియజేసిన సమస్యలపై త్వరలోనే ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తామని, సదరు సమావేశానికి సమస్యలపై పరిష్కార చర్యలతో కూడిన పూర్తి స్థాయి నివేదికలతో అటవీ, ఇరిగేషన్, రెవెన్యూ ఉన్నత స్థాయి, జిల్లాస్థాయి అధికారులు హాజరు కావా లని ఆదేశించారు. ఈ సమావేశంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు,ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య(చంటి), పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు,చింతల పూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, అటవీశాఖ ఉన్నతాధికారులు, జిల్లా అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులు మట్టిలో మాణిక్యాలు



- ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు
- గురుకులాల్లో చదివే ఎంపీసీ, బైపీసీ విద్యార్థులందరూ ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు కావాలి
- వారంతా సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం
- ఆ లక్ష్య సాధనకు అనుగుణంగా అందరం కృషి చేయాలి
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపు

విజయవాడ (చైతన్యరథం): గురుకులాల్లో చదివే ప్రతి ఎంపీసీ విద్యార్థి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్... ప్రతి బైపీసీ విద్యార్థి ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్ అయ్యేలా వారిని తీర్చిదిద్దాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం విజయవాడ లెనిన్ సెంటర్‌లోని అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో డా.బీఆర్ అంబేద్కర్ గురుకులాల ఐఐటీ నీట్, ఎక్సలెన్సీ సెంటర్ల సిబ్బందికి శిక్షణ తరగతులను మంత్రి డా.స్వామి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గురుకులాల విద్యార్థులకు ఉచిత ఐఐటీ, నీట్ కోచింగ్‌కు నారాయణ, శ్రీ చైతన్య విద్యా సంస్థల సహకారం మరువలేనిదన్నారు. గురుకులాల్లో చదివే ప్రతి ఎంపీసీ విద్యార్థి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్... ప్రతి బైపీసీ విద్యార్థి ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్ అయ్యేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. పేద పిల్లలు మట్టిలో మాణిక్యాలని, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. పేద విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని, ఆ లక్ష్యసాధన కోసమే ఆయన తన పాలనా కాలంలో అనేక ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారని తెలిపారు. సిబ్బంది నిరంతరం విద్యార్థులకు అందుబాటులో ఉండి అర్థమయ్యేలా తరగతులు బోధించాల న్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం పరిష్కరిస్తుందని మంత్రి డా.డోలా స్వామి హామీ ఇచ్చారు.

# అంతర్జాతీయ స్థాయిలో క్యాన్సర్ ఆసుపత్రి

- అమరావతిలో త్వరలో నిర్మాణాన్ని పూర్తి చేస్తాం
- విజయవాడ ఉత్సవ్‌కు రావడం సంతోషంగా ఉంది
- దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి
- హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



విజయవాడ(చైతన్యరథం): విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా శనివారం రాత్రి గొల్లపూడి ఎగ్జిబిషన్‌ను ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ సినిమాలకు రాజధాని. సినీ పరిశ్రమ అభివృద్ధికి ఎన్నో తరాల కృషి ఉంది. కళలకు ఎప్ప టికీ చావు లేదు. నేటి తరానికి కలలు, సాంప్రదాయాలను చాటి చెప్పడం మనందరి బాధ్యత. కూచిపూడి నృత్యం, కొండపల్లి బొమ్మ లు కృష్ణా జిల్లాలో సాంస్కృతిక గుర్తింపుగా నిలుస్తున్నాయన్నారు. ఆధ్యాత్మికం, పర్యాటకం మిళితమైన ఈ సభలో పాల్గొనడం నాకు ఆనందంగా ఉందన్నారు. దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాల ని కోరుకున్నారు. 46 రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగు తుంది. ఇందులో భాగంగా 11 రోజులు దుర్గమ్మను వివిధ రూపా ల్లో అలంకరించడం ప్రత్యేకత అని తెలిపారు. బసవతారకం ఆసుపత్రి ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వైద్య సేవలు అందిస్తు న్నాం. త్వరలో అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. పేదలకు అందుబాటులో ఆరోగ్య సేవలు అందించడం మా లక్ష్యం. అమరావతికి బ్రాండ్ ముఖ్యమంత్రి చంద్రబాబు. ఆయన అనుభవంతో ఆర్థిక సమస్యలను అధిగమించి రాష్ట్రాన్ని దేశ పటంలో సువర్ణ అక్షరాలతో నిలబెడతారని ఆకాంక్షించారు. విజయవాడ ఉత్సవ్‌ను కన్నుల పండువగా నిర్వహిస్తున్న కమిటీ చైర్మన్ ముత్తవరపు మురళీకృష్ణ, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లకు అభినందనలు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ క్యాన్సర్ బాధితులకు బసవతారకం హాస్పటల్ ద్వారా ఇప్పటికీ ఎంతోమంది సేవలు పొందుతున్నారు. అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోంది. ఇది పూర్తయితే పేదలకు మరింత మంచి వైద్యసేవలు అందుతాయి. బాలకృష్ణకు నేషనల్ అవార్డు రావడం ఆనందకరం. భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిం చారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన వెంటనే 70 ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులు భూములు ఇవ్వడం నిజంగా అభినందనీయం. మైలవరం నియోజకవర్గం త్వరలో గ్రేట ర్ విజయవాడలో కలుస్తుంది. దీంతో గొల్లపూడి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం చంద్రబా బు, మంత్రి లోకేష్ సహకారంతో విజయవాడ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ల రాము, సినీ నిర్మాత అంబికాకృష్ణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరే షన్ చైర్మన్ డూండి రాకేష్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, చిట్టిబాబు, ఎస్.శ్రీని వాస్, ఎన్ఆర్ఐ వల్లభనేని గిరి, చెరుకూరి రాజేశ్వర రావు, విజయ బాబు, ఎం.ఎస్.బేగ్, తదితరులు పాల్గొన్నారు.



# ఆశ్రమం పేరుతో ప్రభుత్వ భూమి కబ్జా





- ప్రజావినతుల్లో స్వామిజీపై ఫిర్యాదు
- వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనుచరుడి దందా
- కుటుంబంపై అక్రమ కేసులు పెట్టి వేధింపులు

మంగళగిరి(చైతన్యరథం): నెల్లూరు జిల్లాలో దొంగస్వామి భూమి కబ్జా చేసి యజ్ఞాలు, యాగాలు, దీక్షలు పేరుతో మోసం చేస్తున్నాడని ప్రకాశంజిల్లా ఒంగోలుకు చెందిన నార్నె వెంకట సుబ్బయ్య టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజావినతులలో ఫిర్యాదుచేశారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో సర్వే నంబరు 879లో చెరువు పోరంబోకు, 883లోని అటవీ భూమిని రామదూత అనే వ్యక్తి ఆక్రమించాడని వివరించా రు. అధికారులను ప్రలోభపెట్టి ఆ ప్రభుత్వ భూమిని విక్రయిం చాలని చూశాడు. సర్వే నెం.883లోని అటవీ భూమిని అనాథ పిల్లల స్కూల్ అని చెప్పి పైరవీలు చేసి జీవోలు తెచ్చుకున్నాడు. వీటిపై ఫిర్యాదు చేస్తే విచారణకు వెళ్లినా అధికారులను కూడా ప్రలోభపెట్టి తప్పుడు రిపోర్టులు ఇప్పించి మోసం చేస్తున్నాడు. దొంగస్వామిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని స్వాధీనంచేసుకోవాలని కోరారు. మాజీ మంత్రి, ఏపీ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ కిడారి శ్రావణ్, ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ వెంకట శివుడు యాదవ్ అర్జీలు స్వీకరించారు.

**మాజీ ఎమ్మెల్యే అనుచరుడి అక్రమ చేసులు**

కోనసీమ జిల్లా పి.గన్నవరానికి చెందిన నీలం ఆనందరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామం లోని ఇంటి సరిహద్దుదారులైన యంగ్ర రమణ, యంగ్ర సోమన్న, కుసుపూడి రాము అనువార్లు తమ ఇంటి ప్రహరీ వద్ద అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నా రు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గతంలో నుంచి ఇంటి సరిహద్దు దారులతో గొడవలు జరుగుతున్నాయి. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అనుచరుడు కుడుపూడి రాము తమపై దాడి చేయించి అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేశారు. ఈ గొడవల వలన తమ కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశారు. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉంది. ఈ కేసు ఈ విషయంలో పోలీసులు తమకు ఎలాంటి న్యాయం చేయలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**భూకబ్జాకు వీఆర్వో అండ**

నెల్లూరు జిల్లా కావలి మండలం అన్నగారిపాలెం గ్రామానికి చెందిన మాలకొండయ్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలోని సర్వే నెం.325లో 1.16 సెంట్లు 326లో 0.61 సెంట్లు, 317లో 0.50 సెంట్లు తమ భార్య లక్ష్మమ్మ పేరు మీద భూమి ఉంది. 60 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. అయితే తమ గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తు లు తమ భూమిని ఆక్రమించి దూర్భాషలాడి దాడి చేశారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు లేవు. తర్వాత తహసీల్దార్ దగ్గరకి వెళితే అక్కడ కూడా పట్టించుకోవడం లేదు. కబ్జాదారులతో గ్రామ వీఆర్వో చేతులు కలిసి తమ భూమిని కాజేశారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమిని తమకు ఇప్పించాలని కోరాడు.

**భూమికి హద్దులు చూపాలి**

నెల్లూరు జిల్లా కావలి మండలం మన్నంగిదిన్నె గ్రామానికి చెందిన అంకమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గిరిజనులైన తాము గత 50 ఏళ్ల నుంచి సర్వే నెం.1324లో భూములను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. అయితే అటవీశాఖ వారు తాము సాగుచేస్తున్న సదరు భూములు అటవీ శాఖకు చెంది నవి అని మమ్ములను అడ్డగించగా తాము కోర్టును ఆశ్రయించి డబ్ల్యు.పి.నెం.9695/1981గా తెచ్చుకున్నాం. గతంలో కలెక్టర్ ముత్యాలరావు ఆధ్వర్యంలో గొల్లపాలెం బిట్‌లో సర్వే నె.1324లో ఆర్.ఓ.ఎఫ్.ఆర్ 88 హెక్టార్లకు గాను 96 ఎకరాల భూమిని మన్నంగిదిన్నె ఎస్టీ ట్రైబుల్స్ బెనిఫిషియర్స్‌కి ఒక్కొక్క రైతుకు 0.90 సెంట్లు లెక్కన మంజూరు చేశారు. ఈ భూములకు సంబంధించి తామకు అన్నధాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా డబ్బులు వస్తున్నాయి. అయితే పాస్‌బుక్‌లు కలిగిన ఈ భూములకు హద్దు లు చూపించి శాశ్వత హక్కులు కల్పించాలని కోరారు.

## అంతర్జాతీయ క్రీడాకారిణి అనూషకు ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ సాయం

- శాప్ చైర్మన్ రవి నాయుడు సమక్షంలో రూ.25 వేలు చెక్ అందజేత



విజయవాడ (చైతన్యరథం): సాఫ్ట్ టెన్నిస్ అంతర్జాతీయ క్రీడాకారిణి ఎన్.అనూషకు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఇటీవల కొరియాలో జరిగిన 9వ ఆసియన్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించిన అనూషకు రూ.25 వేలు చెక్‌ను శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా డూండి రాకేష్‌కి రవినాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## చెస్‌కు మరింత ప్రోత్సాహం

- శాప్ చైర్మన్ రవినాయుడు




గుంటూరు (చైతన్యరథం): రాష్ట్రంలో చెస్ క్రీడ అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. గుంటూరు విజ్ఞాన్ కాలేజీలో శనివారం 62వ జాతీయస్థాయి చెస్ ఛాంపియన్షిప్ ప్రారంభ కార్యక్రమంలో రవి నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో 28 రాష్ట్రాలు, ఐదు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 400 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. 14 మంది గ్రాండ్ మాస్టర్లు ఈ పోటీలకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ ఐ జి రవికృష్ణ గారితో కలిసి శాప్ చైర్మన్ రవి నాయుడు చెస్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఇటువంటి జాతీయస్థాయి పోటీలు ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణం అని రవినాయుడు అన్నారు.

# విజయ్ సభలో విషాదం 36 మంది మృతి

- తమిళనాడులో టీవీకే అధ్యక్షుడి ప్రచారసభలో తొక్కిసలాట
- పలువురి పరిస్థితి విషమం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి



కరూర్ (చైతన్యరథం): తమిళనాడులో ఘోర విషాదం చోటు చేసుకుంది. కరూర్‌లో సినీనటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తీవ్ర తొక్కిసలాట చోటుచేసుకుని ఆరుగురు చిన్నారులు సహా 36 మంది మృతి చెందారు. వంద మంది గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. క్షతగాత్రులను కరూర్ లోని వివిధ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కరూర్‌లో శనివారం రాత్రి విజయ్ నిర్వహించిన ప్రచార సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఈ ఘోర దుర్ఘటనలో నిర్వాహకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 10 వేల మందితో ర్యాలీకి అనుమతి తీసుకోగా, 50 వేల మందికి పైగా విజయ్ అభిమానులు తరలివచ్చారు. దానికితోడు ర్యాలీకి విజయ్ ఏడు గంటలు ఆలస్యంగా రావటంతో గంటల తరబడి పడిగాపులు కాచిన అభిమానులు ఒక్కసారిగా ఎగబడటంతో నియంత్రించడం కష్టంగా మారి తొక్కిసలాటకు దారితీసింది. పరిస్థితి గమనించిన విజయ్.. ప్రసంగాన్ని మధ్యలోనే నిలిపి వేశారు. భారీ సమూహంలో అతికష్టం మీద అక్కడికి చేరుకున్న అంబులెన్సుల్లో బాధితులను ఆసుపత్రులకు తరలించారు. ఈ దుర్ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ విషాద ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యంతో పాటు, అన్ని రకాల సాయం అందించాలని ఆరోగ్యశాఖ మంత్రిని, అక్కడి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కరూర్‌లో సాధారణ పరిస్థితులు తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైద్యులు, పోలీసులకు సహకరించాలని కరూర్ పౌరులకు విజ్ఞప్తి చేశారు.



# కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం




గుంటూరు (చైతన్యరథం): ప్రజారోగ్య కార్మికుల కష్టం, త్యాగాలతోనే జాతీయ స్థాయిలో గుంటూరు నగరం ఖ్యాతిని సాధించిందని, కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. గుంటూరు నగరం సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డ్ పొందడంలో కీలకమైన ప్రజారోగ్య కార్యదర్శులకు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, హెల్త్ ఆఫీసర్లకు, స్వచ్ఛ అచీవర్స్ పేరుతో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అభినందన సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... గుంటూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నిరంతరం కృషి చేస్తున్న సానిటరీ ఇన్స్పెక్టర్లు, హెల్త్ ఆఫీసర్లు కష్టానికి చేతులెత్తి నమస్కరిస్తున్నామన్నారు. కార్మికులకు ఏ సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావలని, అప్కాస్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందడంలేదన్న సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా పరిపాలన చేస్తుందన్నారు. కార్మికులకు ప్రతి 3 నెలలకు ఒకసారి మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నామని, పారిశుధ్య పనుల కోసం పుష్ కాట్స్, ఇతర సామాగ్రిని అందుబాటులోకి తెచ్చామన్నారు. 57 డివిజన్లకు ఒక్కో ఇన్స్పెక్టర్‌కి విధులు కేటాయించడం ద్వారా మెరుగైన పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. కార్మికులు కూడా డ్రైన్ క్లీన్ సమయంలో త్రాగునీటి పైప్ లైన్లలో లీకులు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ... గుంటూరు నగరం జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించినా, గుంటూరు నగర ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తున్నారన్నా కార్మికుల అంకిత భావంతో కూడిన కష్టమే ప్రధాన కారణమన్నారు. కార్మికులు, కార్యదర్శులు, స్వచ్ఛంద సంస్థల కృషి, ప్రజల సహకారంతో గుంటూరు నగరం సూపర్ స్వచ్ఛ లీగ్ నగరాల్లో స్థానంతో పాటు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో 6వ ర్యాంక్ సాధించి, దక్షిణ భారత దేశంలో ఏకైక నగరంగా నిలిచిందన్నారు. ప్రజారోగ్య విభాగంలో పలు సంస్కరణలు తెచ్చామని, అలాగే కార్మికుల సంక్షేమం కోసం కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఆదివారం 3 వేల మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో యాక్సిస్ బ్యాంక్ అకౌంట్ ద్వారా ప్రమాద భీమా రూ.20 లక్షలు అందుతుందన్నారు. కార్మికులు, కార్యదర్శులకు ఆటల పోటీలు, కార్మికుల నివాస ప్రాంతాల నుండి పని ప్రదేశాలకు రవాణా సౌకర్యం కల్పించడానికి త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్టోబర్ 2 నుండి మెరుగైన పర్యవేక్షణకు సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ అందుబాటులోకి వస్తుందన్నారు. 57 డివిజన్ల నుండి ఒక్కో కార్మికులకు, ఐవిఆర్ఎస్ లో ఉత్తమ స్థానం సాధించిన శానిటేషన్ కార్యదర్శులను సన్మానించి, మెమోంటోతో అందించారు. తొలుత నాట్య గురువు ఖలీల్ నేతృత్వంలో శాస్త్రీయ నృత్యం, ప్రజా గాయకులు రమణ నేతృత్వంలో జానపద నృత్యాలు, గీతాలు సభకు హాజరైన వారిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏపి హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ భాషా, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, విద్యార్థులు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, హెల్త్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# వాషింగ్టన్ డీసీలో యువనేత కోడెల శివరాం పర్యటన




వాషింగ్టన్ డీసీ / అమరావతి (చైతన్యరథం): అమెరికాలోని వాషింగ్టన్ డీసీ నగరంలో తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరాం పర్యటించారు. ఈ కార్యక్రమంలో అక్కడ స్థిరపడిన మన రాష్ట్రానికి చెందిన పలువురు వ్యాపారవేత్తలు, తానా సభ్యులు మరియు గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సంఘం అధ్వర్యంలో జూనియర్ కోడెలకి ఘన స్వాగతం పలికారు, ఈ సందర్భంగా జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో నందమూరి తారక రామారావు, నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. అనంతరం సభనుద్దేశించి పలువురు ప్రసంగించారు. అనంతరం యువనేత కోడెల శివరాం మాట్లాడుతూ... ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించి తెలుగు భాషను తెలుగు రాష్ట్రాన్ని తెలుగు జాతిని ప్రపంచ చిత్ర పటంలో ఒక చారిత్రాత్మక స్థానం కల్పించగా, ఈనాడు మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ అ స్థాయిని మరింత ఇనుమడింప జేయడమే కాకుండా ప్రపంచంలో ప్రతి ఒక్క రంగంలో మన వారు శాసించ దగ్గ స్థాయికి వెళ్ళడంలో ప్రధాన భూమిక పోషించారు. ఇంటర్నెట్ అనేది ప్రపంచంలో ఎంత ముఖ్యపాత్ర పోషిస్తున్నాదో అందరికీ తెలుసు, "గాలి ఎంత ముఖ్యమో గూగుల్ అంత ముఖ్యం "అన్నట్టు ఉన్న పరిణామంలో గూగుల్ డేటా సెంటర్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటుకు కృషి చేస్తున్న మన యువ కెరటం నారా లోకేష్‌ని చూసి ప్రతి ఒక్క తెలుగు వాడు గర్వపడాల్సిన విషయం అన్నారు. ఒక్క గూగుల్‌నే కాదు - ఆర్సెలర్. రిలయన్స్, Arcelor Mittal, BPCL refinery, Google, TCS, CAP Gemini వంటి ప్రతిష్టాత్మక మల్టీ నేషనల్ కంపెనీలు తెలుగు రాష్ట్రాన్ని- వెలుగు రాష్ట్రంగా తీర్చి దిద్ది, ప్రతి తెలుగువాడిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్న నారా లోకేష్ ఆశయం చాలా గొప్పది అంటూ, వారు ప్రతిష్టాత్మకమైన చేపట్టిన పీ-4 అనే కార్యక్రమం గురుంచి తెలియజేస్తూ, ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా చరిత్రలో నిలిచిపోతుందని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని పిలుపునిచ్చారు. తాను 2014లో తన తండ్రి శివప్రసాదరావుతో కలిసి గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సంఘం 40 వసంతాల వేడుకలలో పాల్గొన్నానని అది 2024 నాటికి ఎంతో గొప్పగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, ఇదే స్ఫూర్తితో మరో వందేళ్ళు ముందుకు తీసుకొని వెళ్ళాలని, ఈ కోవలో సంఘ అభివృద్ధికి నేను సహాయ పడే అవకాశం ఏ మాత్రం ఉన్నా, నా పూర్తి సహకారం ఉంటుందంటూ, మిమ్మల్ని అందరినీ చూస్తుంటే నాకు, నాన్న మీరూపంలో నా ముందు ఉన్నట్లే ఉంది అంటూ, ఇంతటి అపూర్వ ప్రేమ చూపిస్తున్న మీకు జీవితాంతం రుణపడి ఉంటానని సంతోషం వ్యక్తం చేశారు.

తానా అధ్యక్షులు, మాట్లాడుతూ, గతంలో చంద్రబాబు పిలుపునిచ్చిన "జన్మభూమి " కార్యక్రమంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు గారు పంచాయితీ శాఖా మంత్రిగా గావిదేశాలలో స్థిరపడిన తెలుగువారిని ప్రతి ఒక్క తెలుగువారికి తమకు జన్మ నిచ్చిన భూమికి ఊపిరి పోసే కార్యక్రమాన్ని తెలియజేసి "జన్మ భూమి " కార్యక్రమం లో భాగమయ్యేలా చేసి, తెలుగుదేశం పార్టీకి చంద్రబాబునాయుడుకి దగ్గర బంధం ఏర్పాటు చేశారని తెలియజేశారు . కోడెల గుర్తుకు వస్తే కోటప్పకొండ- క్యాన్సర్ ఆసుపత్రి ముందుగా గుర్తుకు వస్తాయని, అవి రెండు అభివృద్ధిలో ఆయనకు మాత్రమే పేటెంట్ ఇవ్వవచ్చని, వారు మంత్రిగా రాష్ట్రానికి, నాయకుడిగా పార్టీకి చేసిన సేవలు తెలుగుదేశం పార్టీ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించ దగ్గ వ్యక్తి కోడెల వారంటూ ఈ సందర్భంగా పలువురు కోడెలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తానా అధ్యక్షులు నరేన్ కొదాలి, తానా మాజీ అధ్యక్షులు సతీష్ వేమన, నల్లూరి నాగేశ్వరావు, రవి అడుసుమల్లి, మన్నవ సుబ్బారావు, యశస్వి బొద్దులూరి, సాయి బొల్లినేని, భాను మాగలూరి, ఈశ్వర్, శ్రీరామ్ , సుధీర్ కొమ్మి మరియు ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులు పాల్గొన్నారు.

# లింగాల సత్రం ఆశయాలు నెరవేరే ఈ విధంగా నూతన పాలవర్గం పనిచేయాలి

రాజమహేంద్రవరం : ఎంతో ఘన చరిత్ర కలిగిన కోటిలింగాల సత్రం స్థాపించిన పెద్దల ఆశయాలు నెరవేరే విధంగా పేద విద్యార్థులకు ఉపయోగపడేలా వేద పాఠశాల నిర్మాణానికి సహకారం అంద చేస్తానని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు( వాసు) హామీ ఇచ్చారు. కుటమి ప్రభుత్వం హిందూ దేవాలయాల అభివృద్ధికి, ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉందన్నారు. స్థానిక శ్రీ పందిరి మహాదేవుడు సత్రం నూతన పాలకమండలి సభ్యులు చేత ఆలయ ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

# ల్యాండ్ సీలింగ్ యాక్ట్ అమలు జరగడం లేదు

● శాసనసభలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్




అమరావతి (చైతన్యరథం): 1973లో వచ్చిన ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ఎక్కడ అమలు జరగడం లేదని, ఈ రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలు అనేక మంది ఉన్నారని, పరిమితికి మించి ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని జగ్గయ్యపేట నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే శనివారం శాసనసభలో ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ జీరో అవర్‌లో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ రెవెన్యూ శాఖకు సంబంధించిన కీలక అంశాలను ప్రస్తావించారు. 1973లో వచ్చిన ల్యాండ్ సీలింగ్ యాక్ట్ సామాజిక న్యాయం కోసం, ఆర్థిక అసమానతలు తొలగించడానికి తెచ్చిన చట్టమని గుర్తుచేశారు. రెండు పంటల భూమి 10 ఎకరాలు, ఒక పంట భూమి 15 ఎకరాలు, వర్షాధార భూమి 55 ఎకరాల పరిమితి విధించబడిందని, దానిని మించి ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని ఉద్దేశమని చెప్పారు. అయితే 50 సంవత్సరాలు దాటినా ఇప్పటికీ ఈ చట్టం సక్రమంగా అమలుకాలేదని, అనేక కేసులు LRA, LRT, హైకోర్టు, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. భూములను 22లో చేర్చకపోవడం వలన రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, భూములను పేదలకు అందజేయడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి రికార్డులను స్పష్టంగా భద్రపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇనాం భూముల సమస్యపై మాట్లాడుతూ... 1956లో వచ్చిన Inam Abolition Act ప్రకారం రైతులకు పట్టాలు ఇచ్చి, కొనుగోలు- అమ్మకాలు జరగగా, 2013లో సవరణ చేసి 2016లో నిషేధ జాబితాలో చేర్చారని వివరించారు. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయని, 2019లో అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆర్డినెన్స్ పాస్ చేసి రాష్ట్రపతి ఆమోదం కూడా తెచ్చుకున్నప్పటికీ అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందకముందే ప్రభుత్వం మారిందని చెప్పారు. తరువాత వచ్చిన ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినా ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం చూపలేదని విమర్శించారు. ప్రజల సమస్యల్లో ఎక్కువ భాగం రెవెన్యూ సమస్యలేనని గుర్తుచేసి ముఖ్యమంత్రి రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టి, రెవిన్యూ అధికారులతో మంత్రులు సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోరారు.

# శాసనసభను గౌరవసభగా ఎమ్మెల్సీలు భావించాలి : కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట (చైతన్యరథం): శాసనసభను వైసీపీ నాయకులు గౌరవసభగా భావించాలని పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ వ్యాఖ్యానించారు. శాసనసభ అంటే గౌరవ సభ అని అలాంటి స్థానంలో ఉన్న వ్యక్తులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం బాధాకరమన్నారు. పెద్దల సభలో వైసీపీ నాయకులు ఏవిధంగా మాట్లాడుతున్నారో... ఏవిధంగా పరుష పదజాలం ఉపయోగిస్తున్నారో ఆలోచించుకోవాలని, అన్నింటినీ ఒక భూతులాగా చూస్తూ విమర్శలు చేయడం దారుణమన్నారు. అహంకారంతో లెక్కలేనితనంగా సాక్షాత్తు ముఖ్యమంత్రిని కూడా ఒక సాధారణ ఎమ్మెల్యేగా సంభోధించడం సిగ్గుచేటు అని ఎంతో గౌరవ ప్రదంగా మాట్లాడాల్సిన ముఖ్యమంత్రిని కూడా ఒక సాధారణ ఎమ్మెల్యే అని సంభోధించడం దారుణమన్నారు. గతంలో వైసీపీ నేతలు అధికారంలో ఉన్నప్పుడు భూతులతో, మహిళల శీలాలతో దురుసు వ్యాఖ్యలు చేయడం జరిగిందని, వైసీపీ నేతలు ఎంత అహంకారంతో మాట్లాడుతున్నా సరే.... రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం తల దించుకుని గౌరవ ప్రధమైన శాసనసభని ముందుకు తీసుకువెళుతుందన్నారు. శాసనసభలో ముఖ్యమంత్రిని అవహేళనగా మాట్లాడటాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ముఖ్యమంత్రిని ఏకవచనంతో సంభోధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కొమ్మాలపాటి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బారాయ గుప్తా, కొక్కిరాల శ్రీనివాసరావు, కూరపాటి హనుమంతరావు, కొల్లి ఆంజనేయులు, కిషోర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వన్ సిటీ... వన్ సెలబ్రేషన్ ఘనంగా విజయవాడ ఉత్సవ్

**●తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆకట్టుకుంటున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు**




విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో "సొసైటీ ఫర్ వైబ్రేంట్ విజయవాడ" సారథ్యంలో వరల్డ్స్ బిగ్గెస్ట్ ఫెస్టివ్ కార్నివల్ "విజయవాడ ఉత్సవ్" నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం నందు, ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ ఉత్సవ్' సంస్కృతిక కళల అభిమానులను అలరిస్తోంది. అరవరోజు శనివారం తుమ్మలపల్లి క్షేత్రియ్య కళాక్షేత్ర వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాజమహేంద్రవరంకు చెందిన లలిత సింధూరి కూచిపూడి నృత్య ప్రదర్శన రాజమహేంద్రవరానికి చెందిన లలిత సింధూరి కూచిపూడి నృత్య రవళి రంజింపజేసింది. సంధ్యతాండవం, నారాయణ తీర్థులివారి తరంగం, జైజై దుర్గే, బాలమురళీకృష్ణ రచించిన సకల గణాధి పాలయమాం నృత్యాలతో లలిత సింధూరి కూచిపూడి బృంద ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారి నృత్య రూపాన్ని తలపించింది. ప్రేక్షకులకు కనుల విందు చేసింది.

**విజయవాడకు చెందిన దేవి భవాని కూచిపూడి నృత్య ప్రదర్శన**

విజయవాడకు చెందిన దేవి భవాని బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. గణపతి స్తుతి, అంబ పరమేశ్వరి, కూచిపూడి వారి ఇలవేల్పు అయిన శ్రీబాలత్రిపుర సుందరి అమ్మవారి కీర్తనలు, బాల్గా కోటి, వేదాంతం రామలింగశాస్త్రీ రచించిన నృత్య దర్శకత్వంలోని అంశం, మహేశ్వరి మహకాళిదేవి స్తృతి కూచిపూడి చరితను లికించింది. విజయవాడ ఘంటసాల కళాశాల కూచిపూడి ఉపాధ్యాయుడు సి అజయ్‌కుమార్ శిష్య బృందంచే కూచిపూడి నృత్య రవళి విజయవాడ ఘంటసాల కళాశాల కూచిపూడి ఉపాధ్యాయుడు సి అజయ్ కుమార్ శిష్య బృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం కన్నుల విందు చేసింది. కృష్ణమ్మ పరవళ్ళు తొక్కినట్లు కూచిపూడి ఉపాధ్యాయుడు సి అజయ్ కుమార్ శిష్య బృందం ఇచ్చిన ప్రదర్శన అద్భుతంగా ఆకట్టుకుంది.

**విశాఖ పట్టణానికి చెందిన అక్తర్ హుస్సేన్ మేజిక్ షో**

విశాఖ పట్టణానికి చెందిన నేషనల్ అవార్డు గ్రహీత అక్తర్ హుస్సేన్ ప్రదర్శించిన గారడి ప్రదర్శన ప్రతి ఒక్కరినీ మంత్ర ముగ్ధులను చేసింది. చూపు తిప్పుకొనియ్యకుండా వీక్షకులను కుర్చీలకి కట్టి పడేసింది. షోలోని మంత్రిజాలానికి ప్రేక్షకులు మంత్ర ముగ్ధులయ్యారు.

**కోనసీమకు చెందిన పిబిఎస్ కుమార్ బృందంచే గరగల ప్రదర్శన**

కోనసీమకు చెందిన పిబిఎస్ కుమార్ ప్రదర్శించిన గరగల నృత్యం ఆకట్టుకుంది. పిబిఎస్ కుమార్ బృందంచే ప్రదర్శించిన గరగల ప్రదర్శన అమ్మవారి ఆరాధన ప్రాముఖ్యత, ప్రాధన్యతను ప్రజలకు తెలిసేలా చేసింది. అమలాపురానికి చెందిన గరగల ప్రదర్శన సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తలపై ఉన్న వాయిద్యం చేసే శబ్దం గర గర అని వస్తుంది. ఈ కళకు అందుకే గరగల ప్రదర్శన అని పేరు వచ్చింది.

# మహిళాభ్యున్నతి కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తాం

**● అసెంబ్లీ ప్రాంగణంలో ఉభయసభల స్పీకర్ల ఆధ్వర్యంలో సమావేశం**



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో మహిళాభ్యున్నతికి శక్తి వంచన లేకుండా పని చేస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో శనివారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు అసెంబ్లీలో నియమించిన ఎనిమిది జాయింట్ కమిటీలలోని సభ్యుల తొలి సమావేశాన్ని నిర్వహించారు. మహిళ, శిశు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ కమిటీ సభ్యురాలి హోదాలో ఎమ్మెల్యే సునీత పాల్గొన్నారు. శాసనసభకు పనిభారం ఎక్కువగా ఉన్నందున కమిటీలు.. బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు ఇవాల్సిన అవసరం ఉందని ఉభయసభల స్పీకర్లు సభ్యులకు సూచించారు. కమిటీ సభ్యులు జిల్లాలలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని చర్చించి పరిష్కార మార్గాలను సూచించాలని చెప్పారు. అవసరమైతే ఇతర రాష్ట్రాలలో కూడా పర్యటనలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ చట్టసభలకు ఈ కమిటీలు ఎంతో కీలకంగా మారబోతున్నాయన్నారు. ముఖ్యంగా శాసనసభలో అన్ని అంశాలు చర్చించే అవకాశం ఉండదని.. క్షేత్రస్థాయిలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు పడే ఇబ్బందులు చాలా ఉన్నాయన్నారు. మహిళాభ్యున్నతి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం అందిస్తున్నారని.. అయితే ఇంకా క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం మరింత పకడ్బందీగా చట్టాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తమ ప్రాంతంలో గమనిస్తున్న అన్ని అంశాలను మహిళా, శిశు కమిటీ ఛైర్మన్ ద్వారా సభాపతుల దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే సునీత అన్నారు...

# స్త్రీ సాధికారతే సమాజ పురోగతి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): స్త్రీ సాధికారతే సమాజ పురోగతి అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. తిరుపతిలో సెప్టెంబర్ 14, 15 తేదీల్లో జరిగిన జాతీయ మహిళా సాధికారిత సదస్సు గురించి శనివారం అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొని ప్రసంగించారు. "సమాజ పురోగతి, దేశ అభ్యున్నతి అనేవి ఆ దేశంలోని స్త్రీల స్థితిగతులపై ఆధారపడి ఉంటాయి. బాధ్యత గల ప్రభుత్వాలు ఎప్పుడూ స్త్రీ సాధికారతను విస్మరించవు. ఈ క్రమంలోనే దేశంలోనే మొట్టమొదటిసారిగా మహిళా సాధికారతపై ఇంత పెద్ద కాన్ఫరెన్స్ మన రాష్ట్రంలో జరగడం సంతోషకరమే కాక గర్వకారణం కూడా" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతి, జెండర్ సెన్సిటివ్ పాలసీలు, జెండర్ బడ్జెటింగ్, స్థానిక సంస్థల్లో 33% రిజర్వేషన్ల వంటి అంశాలపై రెండు రోజుల పాటు అనేక రాష్ట్రాల మహిళా నాయకులు విలువైన సూచనలు ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రస్తావించారు. "ఇంతమంది ప్రతిభావంతులైన మహిళా నేతలను ఒకే వేదికపై కలుసుకునే అవకాశం కల్పించినందుకు గౌరవ స్పీకర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు" తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల పట్ల తీసుకుంటున్న నిర్ణయాలు, సంక్షేమ పథకాలు దేశంలోనే ఉన్నత స్థాయిలో ఉన్నాయని గళ్ళా మాధవి తెలిపారు. ఆడవారికి ఆస్తిలో సమాన హక్కు, మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఇటువంటి సదస్సులు మరిన్ని జరగాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి, ఉపసభాపతి రఘురామకృష్ణంరాజుకి, పురందరేశ్వరికి, మహిళా సంక్షేమ కమిటీ ఛైర్మన్ చరితకి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి - సంక్షేమంలో చంద్రబాబు కాలంతో పోటీపడుతున్నారు

**●సూపర్ సిక్స్ సూపర్ హిట్ అవడంతో వైసీపీకి నిద్రలేని రాత్రులు**

**●జగన్ పాలన ప్రజలకు పీడకలగా మిగిలితే... చంద్రబాబు సుపరిపాలన సుఖసంతోషాలు, స్వేచ్ఛా స్వాతంత్ర్యం తీసుకొచ్చింది**

**●టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వెల్లడి**



చిలకలూరిపేట (చైతన్యరథం): సూపర్ సిక్స్ సూపర్ హిట్ అవడంతో వైసీపీ నిద్రలేని రాత్రుళ్లు అనుభవిస్తోందని, గత ఐదేళ్ల పాలన ప్రజలకు పీడకలగా మిగిలిందని, సమస్త వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని, అలాంటి స్థితి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి చంద్రబాబుకు 15 నెలలు పట్టిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం శాసననసభలో 'సూపర్ సిక్స్ – సూపర్ హిట్' అన్న అంశంపై చేపట్టిన లఘుచర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కాలంతో పోటీపడుతూ.. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగుతున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ప్రజల అంచనాలకు మించి కూటమిప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి, సంక్షేమమనే జోడు గుర్రాలపై సవారీ చేస్తోంది. జగన్‌రెడ్డి అంతగా ఆర్థిక విధ్వంసం చేసినా ఇన్ని పథకాలు.. సకాలంలో ఎలా అమలుచేస్తున్నారని ప్రజలు కూడా ఆశ్చర్యపోతున్నారని ప్రత్తిపాటి చెప్పారు. రూ.1000పెంచడానికి జగన్ ఐదేళ్లు పడితే.. చంద్రబాబు 5 రోజుల్లో పింఛన్ రెట్టింపు చేశాడు. ఐదేళ్లలో జగన్ పెంచలేని సామాజిక పింఛన్లను చంద్రబాబు కేవలం 5 రోజుల్లోనే పెంచాడని, రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచిన ఘనత ఆయనదేనని ప్రజలే చెబుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు. జగన్‌కు రూ.1000 పెంచడానికి ఐదేళ్లు పట్టిందన్నారు.

**తల్లికి వందనం అమలుతో కూటమి ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టించింది**

తల్లికి వందనం పథకం అమలుతో కూటమి ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టించిందని, గతంలో జగన్ ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే కేవలం ఒక్కరికే అమ్మఒడి ఇచ్చి మోసగించాడన్నారు. ఆ సొమ్ముకూడా తర్వాత నాన్నబుడ్డి పేరుతో రూ.30వేలకోట్లు తిరిగి తన ఖజానాకే చేర్చాడన్నారు. కానీ నేడు యువ నాయకుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో 64 లక్షల మంది విద్యార్థులకు ఒకేరోజు తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేయడం జరిగిందన్నారు.

**అన్నదాతా సుఖీభవ కింద 47లక్షల రైతాంగానికి పెట్టుబడి సాయం**

అన్నదాతా సుఖీభవ కింద ఇప్పటికే ప్రభుత్వం రూ.7వేల తొలివిడత సాయం రైతులు ఖాతాల్లో వేసిందని, మిగిలిన సొమ్మును కూడా త్వరలోనే జమచేస్తుందని ప్రత్తిపాటి చెప్పారు. ఏడాదికి రూ.20వేల పెట్టుబడి సాయం 47 లక్షల మంది రైతాంగానికి ప్రభుత్వం అందచేస్తోందన్నారు.

**స్త్రీశక్తి పథకం మహిళలకు ఎంతో ఉపయోగపడుతోంది**

స్త్రీ శక్తి పథకం కింద ఇప్పటికే 5కోట్ల మంది బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారని, ఏటా ఆర్టీసీపై రూ.2వేలకోట్ల భారం పడుతోందన్నారు. ఈ పథకం వల్ల ఉపాధి, ఉద్యోగాలు చేసుకునే మహిళలకు మంచి లబ్ధి కలుగుతోందన్నారు.

**కేవలం 150 రోజుల్లో మెగాడీఎస్సీ అమల్లో లోకేశ్ కృషి అసామాన్యం..**

మెగా డీఎస్సీని సాకారం చేయడం ద్వారా ప్రభుత్వం వేల కుటుంబాల్లో దసరా పండుగ సంతోషాన్ని ముందే తీసుకొచ్చిందన్న ప్రత్తిపాటి, నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థుల కళ్లల్లోని ఆనందమే అందుకు నిదర్శనమన్నారు. కేవలం 150 రోజుల్లోనే డీఎస్సీని పారదర్శకంగా అమలు చేయడంలో మంత్రి లోకేశ్ కృషి అసామాన్యమని, డీఎస్సీ నిర్వహణకు అడ్డుపడుతూ న్యాయస్థానాల్లో వేసిన 100కు పైగా పిటిషన్లను పరిష్కరించి మరీ నూతన ఉపాధ్యాయుల కల నిజం చేశాడని ప్రత్తిపాటి తెలిపారు.

# అమ్మవారు స్త్రీశక్తికి ప్రతీక... అమ్మవారి దర్శనం ఆనందదాయకం : నెట్టెం రఘురాం

విజయవాడ (చైతన్యరథం): నవరాత్రుల ఆరవ రోజు శనివారం లలిత త్రిపురసుందరి అవతారంలో దర్శనమిస్తున్న శ్రీ కనకదుర్గమ్మ తల్లిని మాజీమంత్రి, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, కృష్ణాజిల్లా సహకార బ్యాంకు (కేడీసీసీబీ) చైర్మన్ నెట్టెం రఘురాం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బొర్రా గాంధీ, దేవస్థాన అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నెట్టెం రఘురాం మాట్లాడుతూ... "అమ్మవారు స్త్రీ శక్తికి ప్రతీక. అమ్మవారి మహిమాన్విత శక్తిని చూసి లక్షలాది మంది భక్తులు తరలి రావడం దానికి నిదర్శనం. అమ్మవారిని దర్శించుకోవడం మా కుటుంబానికి స్ఫూర్తిదాయకం. మహిళల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం వలన మహిళలు మరింత ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రజలందరినీ ఆదరించమని, కరుణించమని అమ్మవారిని ప్రార్థించాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం తెలుగుయువత అధ్యక్షుడు రాళ్లపల్లి మాధవ, ఉత్సవ కమిటీ సభ్యులు నెలకుర్తి వెంకటరావు, పచ్చవ మల్లికార్జున, రేపాకుల శ్రీనివాస్, శివప్రసాద్, చలసాని రమణ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# గృహ నిర్మాణశాఖలో భారీ కుంభకోణం

**ఆప్షన్ -3 ఇళ్లలోనే రూ.3 వేల కోట్లకు పైగా దోపిడీపై సిట్‌తో సమగ్ర విచారణ జరిపించి అక్రమాలను నిగ్గు తేల్చాలి**

**అసెంబ్లీలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



సర్వేపల్లి, (చైతన్యరథం): హౌసింగ్ శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.3 వేల కోట్లకు పైగా కుంభకోణం జరిగిందని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ సొంతంగా ఇళ్లు కట్టుకోలేని గిరిజన బిడ్డలతో పాటు నిరుపేదలకు గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రూ.2.30 లక్షల చొప్పున మంజూరు చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ మొత్తాన్ని జగన్ రెడ్డి రూ.1.80 లక్షలకు తగ్గించారన్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ జగనన్నకాలనీల పేరుతో దుర్మార్గాలకు పాల్పడ్డారన్నారు. భూసేకరణ, లేఅవుట్ల అభివృద్ధితో పాటు ఇళ్ల నిర్మాణంలోనూ భారీ అవినీతి జరిగిందన్నారు. బేస్మెంట్లు, నాణ్యత ...స్టీలు మచ్చుకైనా కనిపించదన్నారు. ఒక ఇంటికి వాడాల్సిన సిమెంటును మూడు, నాలుగు ఇళ్లకు వినియోగించారన్నారు. ఎలాంటి ఫౌండేషన్ లేకుండా నేలపైనే తూతూమంత్రగా బేస్మెంట్లు కట్టారన్నారు. సిట్‌తో సమగ్ర విచారణ జరిపించి అక్రమాలను నిగ్గు తేల్చాలని కోరారు. తన నియోజకవర్గంలో అత్యంత నాసిరకంగా జరిగిన నిర్మాణాలను సాక్షాత్తు హౌసింగ్ మంత్రి పార్థసారథి స్వయంగా చూశారన్నారు. ఆప్షన్ -3లో చేపట్టిన ఇళ్లలో పేద కుటుంబాలు పిల్లా పాపలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సిన భయానక పరిస్థితి నెలకొందన్నారు. కాంట్రాక్టర్లపై కేసులు పెట్టి, వారి మెడలు వంచి రికవరీ చేయాలన్నారు. తిరిగి వారి చేతే పేద కుటుంబాలకు నాణ్యతతో కూడిన ఇళ్లు కట్టించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి ఇంటికి మన సీఎం చంద్రబాబు నాయుడు అదనంగా రూ.75 వేలు వరకు మంజూరు చేశారన్నారు. ఒక్కో యూనిట్ కు రూ.1.80 లక్షల నుంచి రూ.2.55 లక్షలకు పెంచారన్నారు. ఆప్షన్ -3లోని నిరుపేదల ఇళ్లను దోపిడీ వనరుగా మార్చుకున్నారన్నారు. బేస్మెంట్ లెవల్ లోనే భారీగా దోపిడీకి పాల్పడ్డారన్నారు. రూ.53 వేలుగా ఉన్న బేస్మెంట్ లెవల్ బిల్లును రోజుల వ్యవధిలో రూ.70 వేలకు పెంచేశారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి గతంలో ఈ దోపిడీ అంశాన్ని తీసుకెళ్లగానే నెల్లూరు జిల్లాకు సంబంధించి విజిలెన్స్‌తో విచారణ చేయించారన్నారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే రూ.100 కోట్ల అవినీతి జరిగినట్లు తేలిందన్నారు. నాణ్యత విషయంలో కూడా విచారణ చేస్తే మరో రూ.100 కోట్ల అక్రమాలు బయటపడుతాయని విజిలెన్స్ అధికారులు వెల్లడించారన్నారు. ఒక్క నెల్లూరు జిల్లాలో రూ.200 కోట్లు దుర్వినియోగమైతే ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఏ స్థాయిలో జరిగివుంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆప్షన్ -3 హౌసింగ్ స్కామ్ పై సిట్ తో విచారణ జరిపించాలని కోరారు. కాంట్రాక్టర్ల ముక్కు పిండి దోపిడీ చేసిన సొత్తును కక్కించడంతో పాటు గొంతు కత్తి పెట్టి అయినా నిరుపేదలకు నాణ్యతతో కూడిన ఇళ్లు కట్టించాలని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.

# అక్రమ మైనింగ్ కేసుల్లో అరెస్టులు సరే....

# కొల్లగొట్టిన వందల కోట్ల రికవరీ సంగతేంటి

**ప్రభుత్వం ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించాలి**

**రుస్తుం మైన్‌లో క్వార్ట్జ్ దోపిడీపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



సర్వేపల్లి, (చైతన్యరథం):సర్వేపల్లి నియోజకవర్గంలోని రుస్తుం మైన్‌లో క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని గతంలోనూ సభలో ప్రస్తావించానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. క్వార్ట్జ్ దోపిడీకి పాల్పడిన వారిలో కొందరు అరెస్ట్ కూడా అయ్యారన్నారు. 2023 డిసెంబర్ 7వ తేదీన రుస్తుం మైనింగ్ నిర్వాహకులు హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారన్నారు. అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు మైనింగ్ లీజు రెన్యూవల్ ప్రక్రియను లీగల్‌గా చేపట్టాలని కోర్టు ఆదేశించిందన్నారు. డిసెంబర్ 16న నేను అక్రమ మైనింగ్ జరిగే ప్రదేశానికి వెళ్లి సత్యాగ్రహం చేపట్టానని గుర్తు చేశారు.

డిసెంబర్ 18న మైనింగ్ మాఫియా నాపైకి హిజ్రాలు, రౌడీలను దాడికి పంపించిందన్నారు. అర్ధరాత్రి తర్వాత పోలీసులు నన్ను బలవంతంగా అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారన్నారు.

డిసెంబర్ 21వ తేదీన నేను ప్రధాన మంత్రి కార్యాలయానికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశానని వెల్లడించారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాలు, క్వార్ట్జ్ నిల్వలు, ట్రక్కులు, ప్రొక్లెయిన్లు, బ్లాస్టింగ్ మెటీరియల్ జీపీఎస్ లొకేషన్ తో సహా బయటపెట్టానన్నారు. ఇన్ని జరిగినా తనను అక్కడి నుంచి లిఫ్ట్ చేశారు తప్ప అక్రమ మైనింగ్ ను ఆపలేదన్నారు. జనవరి 1న డిప్యూటీ సెక్రటరీ టూ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ధీరజ్ కుమార్ ఏపీ మైనింగ్ స్పెషల్ అడిషనల్ చీఫ్ సెక్రటరీకి లేఖ పంపారన్నారు. అక్రమ మైనింగ్ ఆపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించిన తర్వాత ఇక్కడ అక్రమ మైనింగ్ ఆగిందని వెల్లడించారు. క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో అరెస్ట్ అయిన వారు బెయిల్ పై బయటకు వచ్చారన్నారు. దోపిడీకి గురైన వందల కోట్ల విలువైన క్వార్ట్జ్ కు సంబంధించి రికవరీ మాత్రం జరగలేదన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌లో కీలకపాత్ర పోషించిన పెద్దమనిషి 87 రోజులు జైలులో ఉన్నాడు. 57 రోజులు కనిపించకుండా పోయాడన్నారు. గతంలోనూ ఆయన తన కుటుంబానికి విదేశాల్లో వెయ్యి కోట్ల ఆస్తులున్నాయంటూ నకిలీపత్రాలు సృష్టించి రెండు నెలలు పరారయ్యాడన్నారు. మొత్తంగా ఆయన 117 రోజులు కనిపించకుండా అజ్ఞాతంలో, 87 రోజులు జైలులో గడిపాడన్నారు. ఇంతటి చరిత్ర కలిగిన వ్యక్తికి జగన్ రెడ్డి మేనత్త వరుసయ్యే ఆమె పీహెచ్‌డీ ప్రదానం చేసిందన్నారు. మొత్తంగా 204 రోజుల అరణ్యవాసం, అజ్ఞాత వాసం రికార్డు సృష్టించిన ఆ పెద్దమనిషికి మరో డాక్టరేట్ ఇవ్వాలని కూడా తాను కోరుకుంటున్నానన్నారు. కేసుల నమోదు, అరెస్టులు, బెయిళ్లు..ఆ తర్వాత కొన్ని సంవత్సరాల పాటు కేసులు జరుగుతున్నాయని, మాజీ సీఎం కేసులు 13 ఏళ్లుగా కొనసాగుతూనే ఉండటం చూస్తున్నామని వెల్లడించారు. అక్రమార్కులు కొల్లగొట్టిన కోట్లాది రూపాయల ప్రజాధనం రికవరీ ఎలా జరగాలనే విషయంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించాలని మైనింగ్ శాఖ మంత్రిని కోరారు. ఎవరి పాటికి వాళ్ళు, అక్రమ మైనింగ్‌తో ప్రజల సొత్తును కొల్లగొట్టుకుంటూ పోతే ఎలా అని ప్రశ్నించారు. రుస్తుం మైనింగ్ లీజు రెన్యూవల్ కాకుండా గత ప్రభుత్వం అడ్డుకుంది. కోర్టు ఉత్తర్వులను కూడా అమలు చేయలేదన్నారు. మైనింగ్ లీజు రెన్యూవల్‌కు సంబంధించిన ఫైలు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ఉందని, బాధితుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సోమిరెడ్డి పేర్కొన్నారు.

# బాలయ్య కనుసైగ చేస్తే వైసీపీ గ్యాంగ్‌ను తరిమి కొడతాం

**నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హెచ్చరిక**



నెల్లూరు, (చైతన్యరథం): నందమూరి బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే వైసిపి నేతలను తరిమి తరిమి కొడతామని నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. పైసాకు పనికిరాని నేతలందరూ.. బాలకృష్ణపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన దాంట్లో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి సైకో అనే సొంత పార్టీ నేతలే అంతర్గత సమావేశాలలో తిట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే సైకో అనే పదానికి జగన్ వల్ల గుర్తింపు వచ్చిందన్నారు. జగన్ సైకో అని ప్రపంచంలో ఉండే తెలుగోళ్ళందరికి తెలుసన్నారు. బాలకృష్ణ మీద విమర్శలు చేసే పేర్ని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీ గుడివాడ అమర్నాధుల బండారం అందరికీ తెలుసన్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు పేర్ని నాని, కొడాలి నాని, వంశీ, గుడివాడ అమర్నాథ్‌లు రహస్యంగా సమావేశమైన మాట వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. జగన్ సైకోయిజం వల్ల రాజకీయ జీవితం నాశనం అయిందని మాట్లాడుకున్న మాట వాస్తవమ్ కదా అని కోటంరెడ్డి ప్రశ్నించారు. జగన్ కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదని మీరు మాట్లాడుకోలేదా.? అని సూటిగా అడిగారు. బాలకృష్ణ ఎదురుపడితే పేర్ని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీలు ప్యాంటు లోనే పోసుకుంటారని విమర్శించారు. అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడినవి అన్నీ నిజాలేనని, దానికి వైసీపీ నేతలు కుక్కల్లా మొరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి కళాకారులను అవమానపరిచారని కోటంరెడ్డి అన్నారు. బాలకృష్ణ అసెంబ్లీలో ఏం మాట్లాడారో ఒకసారి గమనించండి అంటూ కోటంరెడ్డి మండిపడ్డారు. చిరంజీవి లాంటి పెద్ద హీరోలకు అపాయింట్మెంట్ ఇచ్చి.. ఇంటి బయటే కార్లు ఆపి.. నడిపించిన ఇగోయిస్టు, సైకో జగన్ అని కోటంరెడ్డి అన్నారు. కానిస్టేబుల్ ను చూసి భయపడి బెడ్ రూమ్ లోకి పరిగెత్తే కాకాణి కూడా బాలకృష్ణ ని తిడుతున్నాడని విమర్శించారు.

పోలీసులకు బయపడి.. అజ్ఞతంలోకి వెళ్లిన పిరికోడు కాకాణి అంటూ ధ్వజమెత్తారు. చిరంజీవి, పవన్ కుటుంబం అంటే బాలకృష్ణకి ఎంతో అభిమానం అని అయన చెప్పుకొచ్చారు. కూటమిలో చీలికలు తీసుకురావాలని వైసీపీ పెటియం బ్యాచ్ కుట్రలు చేస్తుందని.. అది జరిగే పని కాదన్నారు. పేర్ని నాని, కొడాలి నానీలు యదవులని.. బాలకృష్ణ కనుసైగ చేస్తే వాళ్ళ ఇల్లు, వాళ్ళ భూమి మీద కూడా మిగలరని కోటంరెడ్డి హెచ్చరించారు.

బాలకృష్ణ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో ఉండాలని.. లేకపోతే ఒక్కొక్కడికి ఒళ్ళు హూనం చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

లోకేష్ బాబు తో పెట్టుకుని వల్లభనేని వంశీ గతి ఏమైందో చూశారని.. బాలకృష్ణతో పెట్టుకుంటే మీ బతుకులు అంతకంటే దయనీయంగా మారుతాయని కోటంరెడ్డి అన్నారు. బాలకృష్ణ జోలికి రావద్దని..ఆయన, అభిమానులు ఆగ్రహం చూస్తే తట్టుకోలేరని కోటంరెడ్డి అన్నారు.

**ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న కల్వర్టు సమస్యను పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలలో ధర్మవరం సుబ్బారావు బృందం కమిషనర్ ఓవై నందన్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి కల్వర్టు పై నూతన మ్యాన్‌హోల్ కవర్ అమర్చేందుకు పనులు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.**



# మహిళలు, చిన్నారుల రక్షణే ప్రధాన లక్ష్యం

**అసెంబ్లీ జాయింట్ కమిటీల సమావేశం సందర్భంగా ఎమ్మెల్యే పరిటా సునీత**
**అసెంబ్లీ ప్రాంగణంలో ఉభయసభల స్పీకర్ల ఆధ్వర్యంలో సమావేశం**

అనంతపురం, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో మహిళాభ్యున్నతికి శక్తి వంచన లేకుండా పని చేస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో శనివారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు అసెంబ్లీలో నియమించిన ఎనిమిది జాయింట్ కమిటీలలోని సభ్యుల తొలి సమావేశాన్ని నిర్వహించారు. మహిళ, శిశు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ కమిటీ సభ్యురాలి హోదాలో ఎమ్మెల్యే సునీత పాల్గొన్నారు. శాసనసభకు పనిభారం ఎక్కువగా ఉన్నందున కమిటీలు.. బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు ఇవాల్సిన అవసరం ఉందని ఉభయసభల స్పీకర్లు సభ్యులకు సూచించారు. కమిటీ సభ్యులు జిల్లాలలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని చర్చించి పరిష్కార మార్గాలను సూచించాలని చెప్పారు. అవసరమైతే ఇతర రాష్ట్రాలలో కూడా పర్యటనలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ చట్టసభలకు ఈ కమిటీలు ఎంతో కీలకంగా మారబోతున్నాయన్నారు. ముఖ్యంగా శాసనసభలో అన్ని అంశాలు చర్చించే అవకాశం ఉండదని.. క్షేత్ర స్థాయిలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు పడే ఇబ్బందులు చాలా ఉన్నాయన్నారు. మహిళాభ్యున్నతి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం అందిస్తున్నారని.. అయితే ఇంకా క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం మరింత పకడ్బందీగా చట్టాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తమ ప్రాంతంలో గమనిస్తున్న అన్ని అంశాలను మహిళా, శిశు కమిటీ ఛైర్మన్ ద్వారా సభాపతుల దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే సునీత అన్నారు.





# భారీ వర్షాలకు ఆదోని అతలాకుతలం

**బాధితులకు లోకేశ్ అనుచర బృందం చేయూత**

ఆదోని, (చైతన్యరథం): పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల కాలనీలలో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన నారా లోకేష్ టీం యువ నాయకులు మారుతీ నాయుడు ఆధ్వర్యంలో, మీనాక్షి నాయుడు సూచనల మేరకు, ఈరోజు ఆ కాలనీలను సందర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు సుమారు 2000 మందికి ఆహార పొట్లాలు మరియు తాగునీటి బాటిల్లు అందజశారు. ఆదోని పట్టణంలోని నిత్యవసర వస్తువుల కిట్లు కూడా పంపిణీ చేస్తామని యువ నాయకులు తెలియజేశారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, అవసరమైన సహాయం అందించడానికి సిద్ధంగా ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప సుబ్బు టీం నారా లోకేష్ యువకులు పాల్గొని కిట్లను పంపిణీ చేశారు.



# ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయానికి శ్రీకారం

దర్శి, (చైతన్యరథం): పేద ఆటోడ్రైవర్లను, క్యాబ్ డ్రైవర్లను ఆదుకునే లక్ష్యంలో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా ఒక్కొక్కరికీ15,000 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేసే పథకం వచ్చే నెల నాలుగవ తేదీన వాహన మిత్ర స్కీం కింద ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటించడం శుభ పరిణామమని దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆటో డ్రైవర్ల తరఫున ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అందిస్తున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని భావించిన కూటమి ప్రభుత్వం వారికి ఆర్థిక సహాయం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె వివరించారు. ఆటో డ్రైవర్లు,



క్యాబ్ డ్రైవర్లు పెండింగ్ చాలానాలను ఫిట్నెస్ సర్టిఫికెట్ల క్లియరెన్స్ చేసుకున్న అర్హులైన దాదాపు 2.9 లక్షల మంది ఆటో డ్రైవర్లకు ప్రతి ఏటా 15,000 రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధమవుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. గత ప్రభుత్వం కేవలం 12,000 మాత్రమే ఆటో డ్రైవర్లకు మొక్కుబడిగా చెల్లించిందన్నారు. నిబంధనల పేరుతో అర్హులైన వారికి అందకుండా చేశారని ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయం అంది కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారన్నారు.



# కల్పవృక్ష వాహనంపై శ్రీ మలయప్ప రాజమన్నార్ అలంకారంలో కటాక్షం



తిరుమల, (చైతన్యరథం): తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు శనివారం ఉదయం శ్రీమలయప్ప స్వామి ఉభయదేవేరులతో కలిసి రాజమన్నార్ అలంకారంలో కల్పవృక్ష వాహనంపై భక్తులకు కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు.

**కల్పవృక్ష వాహనంఐహిక ఫల ప్రాప్తి**

క్షీరసాగరమథనంలో విలువైన వస్తువులెన్నో ఉద్భవించాయి. వాటిలో కల్పవృక్షం ఒకటి. ఈ చెట్టు నీడన చేరిన వారికి ఆకలిదప్పులుండవు. పూర్వజన్మ స్మరణ కూడా కలుగుతుంది. ఇతర వృక్షాలు తాము కాచిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. కల్పవృక్షం అలా కాదు. కోరుకున్న ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అటువంటి కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి నాలుగో రోజు ఉదయం శ్రీవారు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వభూపాల వాహనంపై స్వామివారు అభయమిస్తారు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, సీవీ ఎస్వో మురళికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.




శ్రీశైలం, (చైతన్యరథం): ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం మరింత పెరిగింది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద పెరుగుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్లను 12 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 404658 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 3,81.332 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 5,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,237 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 204,35 టీఎంసీలుగా కొనసాగుతోంది.

**హడలెత్తించిన శుంకేశుల**
**పలుగులు తీసిన అధికారులు**

సుంకేసుల జలాశయం వద్ద కొన్ని గేట్లు పనిచేయడం లేదన్న సమాచారంతో జలవనరుల శాఖ ఇంజినీర్లు శనివారం పరుగులు తీశారు. బ్యారేజీ వద్ద 6 గేట్లు పనిచేయడం లేదని, వరదనీటి విడుదలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈ బాలచంద్రారెడ్డి, డీఈఈ ప్రసాదరావు అక్కడికి వెళ్లారు. ఎలాంటి సమస్య లేదని తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రాజెక్టు 7 గేట్లకు సంబంధించి రోప్ పనులపై ఎస్ఈ ఆరా తీశారు. పనులు ఎందుకు ఆలస్యంగా జరుగుతున్నాయని గుత్తేదారుడిని ప్రశ్నించారు.



## వారిలా వారాంతపు నేతను కాదు

**తమిళ నటుడు విజయ్‌పై ఉపముఖ్యమంత్రి విమర్శలు**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమిళ నటుడు, తమిళగ వెట్టి కళగం పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ ప్రతి శనివారం ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ విజయ్‌పై పరోక్ష విమర్శలు చేశారు. రాజకీయ నాయకుడిగా తన కార్యక్రమాలను వారంలో ఒక రోజుకు మాత్రమే పరిమితం చేయడానికి తానేమీ ఇతర నేతల్లా వారాంతపు రాజకీయ నాయకుడిని కాద ని అన్నారు. "నేను శనివారాల్లో మాత్రమే బయటకు వచ్చే నాయకుడిని కాదు. ఆదివారాల్లో కూడా నేను ప్రయాణిస్తూనే ఉంటాను. అంతెందుకు ఈ రోజు ఆ రోజు అనేది కూడా నాకు తెలియదు" అని ఉదయనిధి పేర్కొన్నారు. తమిళనాడు భాజపా మాజీ అధ్యక్షుడు అన్నామలై సైతం విజయ్ ప్రచారశైలిని తప్పుబట్టారు. విజయ్ తెర వెనక నిలబడి మాట్లాడుతున్నారని ముందుగా ఆయన బయటకు రావాలన్నారు. రాజకీయ నాయకుడంటే వారాంతాల్లో మాత్రమే కాకుండా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కానీ అందుకు విరుద్ధంగా విజయ్ కేవలం శని ఆదివారాల్లోనే ప్రజలకు అందుబాటులోకి వస్తారన్నారు. తాము ఏడాది పొడవునా ప్రజల్లోనే ఉంటామన్నారు. కాబట్టి ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. జీవీకే నిజమైన రాజకీయ పార్టీగా ఉండాలనుకుంటే ఆ పార్టీ అధినేత, ఇతర నేతలు తమ వైఖరిని మార్చుకోక తప్పదన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకే శనివారాల్లో ప్రచారాలు నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తమిళగ వెట్టి కళగం పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలావుంటే. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. జీవీకేతో సహా ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నాయి. రాష్ట్రంలో విజయ్ అధికార డీఎంకేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. భాజపా పైనా విమర్శనాస్త్రాలను సంధిస్తున్నారు.

## అవకాశవాదులను ప్రోత్సహించొద్దు

**తమిళ నటుడు విజయ్ పిలుపు**

తమిళ నటుడు, తమిళగ వెట్టి కళగం పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ తమిళనాడు అధికార డీఎంకే, భాజపాలపై మండిపడ్డారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ కొంగు ప్రాంతంలో ప్రచారాన్ని నిర్వహించిన విజయ్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడు అధికార డీఎంకే ఓటు వేస్తే భాజపాకు వేసినట్లేనని అన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతో స్టాలిన్ ప్రభుత్వం భాజపాతో పొత్తు పెట్టుకోవాలని చూస్తోందని విమర్శించారు. పరిస్థితులకు అనుగుణంగా మారిపోవడం అధికార పార్టీ నేతలకు వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. ఇటువంటి అవకాశవాద రాజకీయాలను ప్రోత్సహించొద్దని ప్రజలకు సూచించారు. 2021 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికార డీఎంకే ఇప్పటికీ అమలు చేయలేకపోయిందని విజయ్ విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ అన్నాడీఎంకే నేతలు కూడా తమ నాయకురాలు దివంగత జయలలిత ఆదర్శాలను మరిచిపోయారని అన్నారు. పైకి 'అమ్మ' పేరును జపిస్తున్నప్పటికీ భాజపాతో పొత్తు పెట్టుకోవడానికి రహస్యంగా చర్చలు కొనసాగిస్తున్నా రని మండిపడ్డారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఇప్పటి వరకు తమిళనాడుకు ఏమి చేసిందని ప్రశ్నించారు. తమిళగ వెట్టి కళగం పార్టీ ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందని విజయ్ హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో పోరు టీవీకేకు, డీఎంకేకు మధ్య జరగనుందని అన్నారు. కాగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. ఎన్నికల్లో విజయం కోసం టీవీకేతో సహా ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నాయి.



# బిహార్ మహిళల ఖాతాలోకి రూ. పదివేలు

***కొత్త పథకం ప్రారంభించిన ప్రధాని మోదీ***
***సీఎం మహిళా రోజ్‌గార్ యోజనను పర్చువల్ విధానంలో ప్రారంభిస్తున్న మోదీ***

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్డీయే కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర మహిళల అభ్యున్నతికి 'ముఖ్యమంత్రి మహిళా రోజ్ గార్ యోజన పేరుతో కొత్త పథకాన్ని శుక్రవారం ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి ప్రారంభించారు. ఈ పథకం కింద ఒక్కొక్కరికీ రూ. 10 వేలు చొప్పున 75 లక్షలమంది మహిళల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, పలువురు మంత్రులు సహా పెద్దసంఖ్యలో మహిళలు హాజరయ్యారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో బిహార్ ఎన్డీయే సర్కారు రూ.7,500 కోట్లతో ఈ పథకాన్ని రూపొందించింది. ప్రతి కుటుంబంలోని ఓ మహిళకు జీవనోపాధిలో భాగంగా వారు ఎంచుకున్న రంగంలో ఆర్థికసహాయం అందిస్తారు. మంచి ఫలితాలు సాధిస్తే తదుపరి దశల్లో రూ.2 లక్షల వరకు పొందే అవకాశం ఉంటుంది. వ్యవసాయం, పశుపోషణ, హస్తకళలు, టైలరింగు, నేత, చిన్నతరహా సంస్థల వంటి ఎంపిక చేసిన రంగాల్లో మహిళలకు ఆర్థిక సహాయం చేస్తారు.





ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ ఆర్జేడీపై విరుచుకుపడ్డారు. ఆర్జేడీ కూటమి రాష్ట్రంలో ఎప్పటికీ అధికారంలోకి రాకుండా మహిళలు అడ్డుకోవాలన్నారు. మీ అభివృద్ధికి పాటుపడే ఇద్దరు సోదరులు (మోదీ, నితీశ్) ఉన్నార'ని గుర్తుచేశారు.

# అసంబద్ధ నాటకాలతో వాస్తవాలను ఏమార్చలేరు

**పాక్ ప్రధానికి భారత్ దౌత్యవేత్త దిమ్మతిరిగే జవాబు**

అంతర్జాతీయ వేదికగా భారత్‌ను నిందించాలని చూసిన పాకిస్థాన్‌కు మరోసారి. భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో సింధూజలాల ఒప్పందం నిలిపివేసిన అంశాన్ని ప్రస్తావిస్తూ భారత్‌ను తప్పుబట్టాలని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రయత్నించారు. ఆయన ఆరోపణలకు భారత దౌత్యవేత్త పేటల్ గహ్లోత్ గట్టిగా బదులిచ్చారు. అసంబద్ధ నాటకాలతో వాస్తవాలను ఏమార్చలేరంటూ ఆమె కడిగిపారేశారు. పేటల్ గహ్లోత్ మహారాష్ట్రకు చెందిన రాజ్‌పుట్ కుటుంబంలో పుట్టారు. ముంబయిలోని సెయింట్ జేవియర్ కాలేజీ నుంచి పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ పట్టా అందుకున్నారు. ఆ తర్వాత ఢిల్లీలోని లేడీ శ్రీరామ్ కాలేజీ ఫర్ విమెన్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. 2015 లో ఇండియన్ ఫారిన్ సర్వీసెస్‌లో చేరి దౌత్యవేత్తగా తన కెరీర్‌ను ప్రారంభించారు. గత పదేళ్లలో ఆమె వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. కేంద్ర





విదేశాంగ శాఖకు చెందిన యూరోపియన్ వెస్ట్ డివిజన్లో అండర్ సెక్రటరీగా సేవలందించారు. పారిస్, శాన్ ఫ్రాన్సిస్కోల్లోని భారత దౌత్య కార్యాలయాల్లో పనిచేశారు. అనంతరం ఐక్యరాజ్యసమితిలోని భారత మిషన్ ఫస్ట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ప్రపంచ వేదికలపై భారత్ తరపున స్పష్టమైన గళం వినిపిస్తూ సమర్థమైన ప్రతినిధిగా పేరు తెచ్చుకున్నారు. గతంలోనూ పలుమార్లు దాయాది ఆరోపణలను ఆమె ఐరాసలో బలంగా తిప్పికొట్టారు. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలకు బదులివ్వడంతో ఈమె పేరు మరోసారి వార్తల్లో నిలిచారు.

### మంచి గిటారిస్ట్ కూడా..

వృత్తిరీత్యా దౌత్య వ్యవహారాల్లో బిజీగా ఉండే పేటల్ గహ్లోత్‌కు సంగీతమంటే అమితమైన ఆసక్తి. ఖాళీ సమయాల్లో గిటార్ వాయిస్తూ పాటలు పాడుతుంటారు. వాటిని తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేస్తుంటారు. ఆమె పాడిన ఇటాలియన్ సాంగ్ 'బెల్లా సియావో'కు సోషల్ మీడియాలో మంచి గుర్తింపు లభించింది.

## పాక్‌తో వాంగ్‌చుక్ సంబంధాలపై దర్యాప్తు

**మీడియాతో డీజీపీ జామ్వాల్ వెల్లడి**

లద్దాక్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌కు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నట్లు డీజీపీ ఎస్ సింగ్ జామ్వాల్ వెల్లడించారు. లేహ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వాంగ్ చుక్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు అనుమానిస్తున్న ఓ పాకిస్థానీ గూఢచారిని ఇటీవల అరెస్టు చేసినట్లు చెప్పారు. సోనమ్ నిరసనల వీడియోలను ఆ వ్యక్తి పాకిస్థాన్‌కు పంపినట్లు తెలిపారు. "లద్దాఖ్‌లో చెలరేగిన హింస వెనుక కీలక వ్యక్తి వాంగ్‌చుక్. ఆయన రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలో చోటుచేసుకున్న నిరసనలను ప్రస్తావించారు. ఆయన నేతృత్వంలో జరిగిన నిరసనల వీడియోలను పొరుగు దేశానికి రిపోర్ట్ చేస్తున్న ఓ పీఐవోను ఇటీవల అరెస్టు చేశాం. అదేవిధంగా వాంగచుక్. విదేశీ పర్యటనల్లో కొన్ని అనుమానాస్పదంగా ఉన్నాయి. పాకిస్థాన్‌లో 'ది డాన్' నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. బంగ్లాదేశ్‌లోనూ సందర్శించారు. వాంగ్ చుక్ స్వచ్ఛంద సంస్థకు విదేశీ నిధులపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోంది. కేంద్రం, లద్దాఖ్ ప్రతినిధుల మధ్య చర్చలను అడ్డుకునేందుకు ఆయన యత్నించారు. ఈ నెల 25న ఇరుపక్షాల మధ్య సమావేశం ఉందని తెలిసీ, తన నిరాహార దీక్షను కొనసాగించారు. సమావేశానికి ఒక రోజు ముందు రెచ్చగొట్టే వీడియోల ప్రదర్శన, ప్రకటనలు చేశారు. శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగా యత్నించారు. ఇది హింసకు, మరణాలకు దారితీసింది" అని డీజీపీ జామ్వాల్ తెలిపారు.

లద్దాఖ్ హింసలో విదేశీ కుట్ర జరిగిందంటూ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్తా చేసిన ఆరోపణలపై డీజీపీ స్పందించారు. ఇటీవలి ఘటనల అనంతరం ముగ్గురు నేపాల్ పౌరులు బుల్లెట్ గాయాలతో ఆసుపత్రిలో చేరారని, మరికొందరి ప్రమేయం కూడా వెలుగులోకి వచ్చిందని అన్నారు. మొత్తం 50 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిలో దాదాపు 10-12 మందిని ప్రధాన నిందితులుగా అనుమానిస్తున్నట్టు చెప్పారు.లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని, ఆ ప్రాంతాన్ని ఆరో షెడ్యూలు పరిధిలో చేర్చాలని కోరడంతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం సాగుతున్న ఉద్యమం ఇటీవల హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. నలుగురు మృతిచెందగా, 90 మంది గాయపడ్డారు. ఈ క్రమంలోనే వాంగచుక్‌కు శుక్రవారం జాతీయ భద్రతా చట్టం (ఎన్‌ఎస్‌ఏ) కింద అరెస్టు చేసి వేరే ప్రాంతానికి తరలించారు. ఆయన అరెస్టును కాంగ్రెస్,ఆమ్ ఆద్మీ పార్టీ సహా ప్రతిపక్షాలన్నీ ఖండించాయి.

## ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి

**బీ20 దేశాలకు కేంద్ర మంత్రి జైశంకర్ పిలుపు**

ఉగ్రవాదంపై ప్రపంచం ఏ మాత్రం సహనం చూపకూడదని భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. గురువారం న్యూయార్క్‌లో జరిగిన బీ20 విదేశాంగ మంత్రుల సమావేశంలో ప్రసంగించారు. ఉగ్రవాదుల మధ్య విస్తృత నెట్వర్క్ ను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకునేవారే అంతర్జాతీయ సమాజానికి పెద్ద సేవ చేస్తారని జైశంకర్ వివరించారు. ఆర్థిక అస్థిరత్వం, ఘర్షణలు, ఉగ్రవాదం వంటి సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటోందని, ఐక్య రాజ్య సమితి వంటి ప్రపంచ సంస్థలు సంక్షోభాలను పరిష్కరించడంలో విఫలం అవుతున్నాయని విమర్శించారు. ఐరాసలో సంస్కరణల అవసరం ఎప్పుడూ లేనంతగా ఉందని, ప్రపంచ పాలనను మరింత నిర్మాణాత్మకంగా, జవాబుదారీగా మార్చాలని పిలుపునిచ్చారు. బీ20 సభ్య దేశాలకు ప్రపంచ స్థిరత్వాన్ని బలోపేతం చేసే బాధ్యత ఉందని, చర్చల ద్వారా ఉగ్రవాదాన్ని గట్టిగా ఎదుర్కోవాలని సూచించారు. అంతర్జాతీయ శాంతి, ప్రపంచ అభివృద్ధి మధ్య సంబంధం ఉందని, అయితే ఇటీవలి కాలంలో రెండూ ఏకకాలంలో క్షీణించాయని, ఫలితంగా ముఖ్యంగా దక్షిణార్ధగోళ దేశాలకు నష్టం జరిగిందని ఆయన తెలిపారు. ఉక్రెయిన్, గాజా యుద్ధాలు ప్రపంచ ఇందనం, ఆహారం, ఎరువుల భద్రతను ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. వాటి సరఫరా, లాజిస్టిక్స్ రూపంలో దేశాలపై ఒత్తిడి పెరిగిందని జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు.



### చాలా దేశాల్లో అవసరమైనంత శ్రామిక శక్తి లేదని గుర్తు చేశారు.

ప్రపంచ దేశాలకు అంతర్జాతీయ శ్రామికశక్తి అవసరం ఉందని.. దాని నుంచి అవి తప్పించుకోలేవని ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. చాలా దేశాల్లో జనాభా పరిస్థితుల కారణంగా డిమాండు కూడా పూర్తి చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. హెచ్-1బీ వీసాల ఫీజు పెంపు నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అబ్జర్వర్ రీసెర్చి ఫౌండేషన్ నిర్వహించిన 'ఎట్ ది ఆర్ట్ ఆఫ్ డెవలప్మెంట్ ఎయిడ్, ట్రేడ్, అండ్ డెవలప్మెంట్ అనే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆ పొరబాటు చేస్తే..
# గ్రీన్‌కార్డు హుళక్కే!

- ◆ ఐ-485ను పూర్తిగా నింపాలంటున్న యూఎస్
- ◆ అక్టోబర్ 20నుంచి టెస్టింగులో మార్పులు



విదేశాలనుంచి వచ్చినవారు అమెరికాలో శాశ్వత నివాసం పొందేందుకు గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటుంటారు. ఆ సమయంలో చేసే ఒక చిన్న పొరబాటు దరఖాస్తు తిరస్కరణకు దారితీయొచ్చని అగ్రరాజ్య వలస సేవల విభాగం తాజాగా హెచ్చరిక చేసింది. అమెరికాలో శాశ్వత నివాసానికి ఉద్దేశించిన గ్రీన్ కార్డు కోసం ఐ-485 దరఖాస్తును పూర్తిచేయాల్సి ఉంటుంది. అయితే అందులోని పార్ట్-9లో అడిగిన ప్రశ్నలకు చాలామంది సమాధానాలు ఇవ్వడం లేదని వలసల విభాగం వెల్లడించింది. దానివల్ల దరఖాస్తు తిరస్కరణకు గురికావొచ్చని లేదా ఆ ప్రక్రియ ఆలస్యం కావొచ్చని హెచ్చరించింది. ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం అమెరికా ఏటా 2,26,000 ఫ్యామిలీ ప్రిఫరెన్స్, 1,40,000 ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డులను జారీ చేసేందుకు వీలుంటుంది. గ్రీన్కార్డు పొందే ప్రక్రియలో ఐ-485 దరఖాస్తుకు ఆమోదం లభించడం అత్యంత కీలకమైనదిగా భావిస్తారు. ఒక కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ప్రత్యేక దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ సమయంలో వారంతా యూఎస్‌లోనే ఉండాల్సి ఉంటుంది. అలాగే చట్టపరంగా అమెరికాకు వచ్చామని నిరూపించే పత్రాలు, జనన ధ్రువీకరణపత్రం, వైద్య పరీక్షల రికార్డులు సమర్పించాల్సి ఉంటుంది.

**అక్టోబర్ 20నుంచి గ్రీన్‌కార్డు టెస్టింగులో మార్పులు..**

ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి వలసలకు సంబంధించిన విధానాల్లో మార్పులు చేస్తున్నారు. ఈక్రమంలో గ్రీన్‌కార్డులు పొందాలనుకునేవారిని పరీక్షించే ప్రక్రియలో మార్పులు ఉంటాయని, అక్టోబర్ 20నుంచి అవి అమల్లోకి వస్తాయని అమెరికా ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసింది. కొన్ని అదనపు అంశాలను పరిగణనలోకి తీసుకోనుంది. "అమెరికా విలువలను పూర్తిగా స్వీకరించేవారికి మాత్రమే గ్రీన్‌కార్డును కేటాయించాలన్నదే మా విధానం. దానిని నిర్ధరం చేందుకే ఈ మార్పులు" అని యూఎస్ సీఐఎస్ ప్రతినిధి వెల్లడించారు. యూఎస్ చరిత్ర, ప్రభుత్వం గురించి దరఖాస్తుదారుడి అవగాహనను పరీక్షిస్తారు. సరైన నైతిక ప్రవర్తన కలిగిఉన్నారా..? అని టెస్ట్ చేయనున్నారు. మొత్తం 20 ప్రశ్నల్లో 12వాటికి సరైన సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.



## 'ఆ కార్లను బయటే పెట్టుకోండి'

ప్రముఖ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ కార్లకు సంబంధించి అమెరికన్ యజమానులకు అక్కడి జాతీయ రహదారుల ట్రాఫిక్ భద్రతా విభాగం కీలక సూచన చేసింది. కార్లను గ్యారేజీల్లో పార్కింగ్ చేయొద్దని, వాటిని నివాసాల బయట లేదా దూరంగా పార్కింగ్ చేసుకోవాలని దాదాపు 2లక్షల మంది యజమానులకు సూచించింది. స్టార్టర్లో సమస్య కారణంగా షార్ట్ సర్క్యూట్ వచ్చి మంటలు చెలరేగే ప్రమాదం ఉందన్న నేపథ్యంలో తాజా అలర్ట్ జారీ చేసింది. అమెరికాలో 2019-22 మధ్య కాలంలో తయారైన కొన్ని వాహనాల ఇంజిన్‌లో స్టార్టర్ రిలే తుప్పుపట్టి విపరీతంగా వేడెక్కే అవకాశం ఉందని, తద్వారా షార్ట్ సర్క్యూట్‌కు కారణమయ్యే ప్రమాదం ఉందని బిఎండబ్ల్యూ గుర్తించింది.
ఈ కారణంగా సమస్య ఉన్నట్లుగా భావిస్తోన్న దాదాపు 1,96,355 కార్లను ఆ సంస్థ రీకాల్ చేస్తోంది. సమస్య పరిష్కారమయ్యే వరకు సంబంధిత కార్లను గ్యారేజీల్లో కాకుండా నివాసాలకు బయట పార్క్ చేసుకోవాలని ఎన్హెచ్‌టీఎస్ఏ సూచించింది. స్టార్టర్‌ను డీలర్లు ఉచితంగా మారుస్తారని, విడిభాగాల లభ్యత కారణంగా ఇది దశలవారీగా కొనసాగనుందని తెలిపింది. మధ్యంతర భద్రతా నోటిఫికేషన్‌ను నవంబర్‌లో యజమానులకు ఈ-మెయిల్ ద్వారా తెలియజేస్తామని పేర్కొంది. ఏయే మోడల్ వాహనాలు రీకాల్ జాబితాలో ఉన్నాయనే విషయాన్ని ఎన్హెచ్‌టీఎస్ఏ వెబ్‌సైట్‌లోనూ తెలుసుకోవచ్చని తెలిపింది.

# మాది.. హైబ్రిడ్ మోడల్

### ఆర్మీ జోక్యాన్ని అంగీకరిస్తూనే సమర్థించుకున్న పాక్ రక్షణ మంత్రి



దాయాది దేశం పాకిస్థాన్‌లో పేరుకే ప్రజా ప్రభుత్వం కానీ.. పరిపాలన అంతా ఆర్మీ కనుసన్నల్లోనే కొనసాగుతుందన్నది తెలిసిందే. ఇప్పుడు అదే విషయాన్ని పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ స్వయంగా వెల్లడించారు. తమ దేశంలో హైబ్రిడ్ మోడల్ పాలన ఉందని అంగీకరించారు. ఆర్మీ, పౌర ప్రభుత్వం కలిసి పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. ఈమేరకు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. "పాకిస్థాన్‌లో మీకు వింత వ్యవస్థ ఉంది. దీనిని మీరు హైబ్రిడ్ మోడల్ అంటున్నారు. చాలా దేశాల్లో రక్షణమంత్రికి దేశ రక్షణపరమైన వివరాలను ఆర్మీ చీఫ్ వెల్లడిస్తారు. కానీ మీ దేశంలో అందుకు భిన్నంగా ఉంది. ఆసిమ్ మునీర్ మీకంటే శక్తివంతమైన వ్యక్తి కదా" అని జర్నలిస్టు ప్రశ్నించారు. ఆ వ్యాఖ్యలను మంత్రి తోసిపుచ్చారు. "అలాంటిది ఏమీ లేదు. నేను ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రతినిధిని" అని సమాధానమిచ్చారు. అదే అమెరికాలో రక్షణశాఖ బాధ్యతలు చూస్తోన్న పీట్ హెగ్సెత్‌కు ఆ దేశ జనరల్లను విధులనుంచి తొలగించే అధికారం ఉంది. కానీ పాకిస్థాన్‌లో అది సాధ్యమవుతుందా? అని అడగ్గా.. "అక్కడ పాలనా విధానానికి, మాకు తేడా ఉంది" అని హైబ్రిడ్ మోడల్‌ను ఖవాజా సమర్థించుకున్నారు. అంతర్జాతీయ వేదికలపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కంటే ఆసిమ్ మునీర్ ఎక్కువగా కనిపిస్తుంటారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పలుమార్లు భేటీ అయిన సంగతి తెలిసిందే. వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. అలాంటి ఆయన రాజకీయాలు అత్యున్నత స్థానాలపై పదవీకాంక్ష లేదని ప్రకటించుకున్న సంగతి తెలిసిందే. దేశసేవ కోసమే భగవంతుడు తనను పుట్టించాడని.. ప్రజలను కాపాడటం తప్ప తనకు మరో ఆలోచన లేదని ప్రచారం చేసుకుంటున్నారు. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ జర్దారీని బలవంతంగా గద్దెదించి ఆ స్థానాన్ని ఆక్రమించనున్నారంటూ కథనాలు వ్యాప్తిలో ఉన్నాయి.

# లీసా.. జాతీయ భద్రతకు ముప్పు

### ఆమెను విధుల నుంచి తప్పించండి - మైక్రోసాఫ్ట్‌కు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్



ప్రముఖ సంస్థ మైక్రోసాఫ్ట్‌లో కీలక హోదాలో ఉన్న ఉద్యోగిని తొలగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేశారు. ఆమె జాతీయ భద్రతకు ముప్పు అని విమర్శించారు. ఈమేరకు తన సోషల్ మీడియా మాధ్యమం ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. మైక్రోసాఫ్ట్‌లో గ్లోబల్ అఫైర్స్‌కు ప్రెసిడెంట్‌గా లీసా మోనాకో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బరాక్ ఒబామా హయాంలో జాతీయ భద్రతా సీనియర్ సలహాదారుగా విధులు నిర్వర్తించారు. జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో (2021-2025) డిప్యూటీ అటార్నీగా, జనరల్‌గా పనిచేశారు. హార్వర్డ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ చికాగో లా స్కూల్లో ఉన్నత విద్యను అభ్యసించిన ఆమె.. ఈ ఏడాది జులైలో మైక్రోసాఫ్ట్‌లో చేరారు. "ఆమె నియామకం ఆశ్చర్యపరిచింది. ఆమె అత్యంత సున్నితమైన సమాచారం పొందగలిగే సీనియర్ హోదాలో ఉన్నారు. ఆమెను ఆ పదవిలో కొనసాగించరాదు" అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వం, టెక్ సంస్థ మధ్య అనేక ఒప్పందాలు ఉన్నందున.. ఆమెనొక జాతీయ భద్రతకు ముప్పుగా ట్రంప్ పేర్కొన్నారు. ఆమె ఎన్నో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడ్డారని, నేషనల్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ నుంచి ఎలాంటి సమాచారం పొందకుండా ఆమెపై ఇప్పటికే ఆంక్షలు విధించామని చెప్పారు. అందుకే వెంటనే మైక్రోసాఫ్ట్ పదవి నుంచి ఆమెను తొలగించాలన్నది తన అభిప్రాయమని రాసుకొచ్చారు. ఈ డిమాండ్‌పై మైక్రోసాఫ్ట్‌ను ప్రశ్నించగా.. స్పందించేందుకు నిరాకరించిందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2021 జనవరి 6న అమెరికా క్యాపిటల్ భవనంపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. అప్పుడు డిప్యూటీ అటార్నీ జనరల్‌గా ఉన్న లిసా.. బైడెన్ ప్రభుత్వం తరపున చురుగ్గా పనిచేశారు. ఆమెకున్న సెక్యూరిటీ క్లియరెన్సులను (సున్నితమైన సమాచారాన్ని పొందడానికి అనుమతి ఉంటుంది) ఈ ఫిబ్రవరిలో ట్రంప్ ఉపసంహరించుకున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటమే అందుకు కారణమని అప్పట్లో ఆరోపించారు.

# ప్రజావేగు ఆత్మహత్య..

### సెటిల్ చేసుకున్న బోయింగ్

బోయింగ్ విమానాల తయారీలో నాణ్యతా లోపాలను ఎత్తిచూపిన మాజీ ఉద్యోగి జాన్ బార్నెట్ అనుమానాస్పద మృతి అప్పట్లో సంచలనమైంది. ఆ మరణానికి కంపెనీ చర్యలు కారణమంటూ బార్నెట్ కుటుంబం వేసిన దావాను బోయింగ్ సెటిల్ చేసుకుంది. 50వేల డాలర్లు (రూ.44,36,500) ఇచ్చి ఈ కేసు ముగించేందుకు అంగీకరించింది. అందు లో 20వేల డాలర్లు చట్టపరమైన ఖర్చుల కింద చెల్లించనుంది. మిగిలినది కుటుంబ సభ్యులకు వెళ్లనుంది. బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ తయారు చేసే దక్షిణ చార్లెస్టన్ ప్లాంటులో బార్నెట్ 2010నుంచి క్వాలిటీ మేనేజర్‌గా పనిచేశారు. ఉద్యోగులకు కంపెనీ కొన్ని లక్ష్యాలను నిర్దేశించి వాటిని చేరుకోవడానికి గడువు విధిస్తోందని 2019లో ఓ ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బార్నెట్ తెలిపారు. దీని వల్ల ఒత్తిడికి గురై నాణ్యత విషయంలో ఉద్యోగులు రాజీ పడాల్సి వస్తోందని ఆరోపించారు. కొన్ని విడిభాగాలను పాత విమానాలనుంచి తీసి కొత్తవాటికి బిగిస్తున్నారని చెప్పారు. మరోవైపు 787 డ్రీమ్‌లైనర్‌లో ఆక్సిజన్ వ్యవస్థలను పరీక్షించినప్పుడు 25శాతం విఫలమయ్యాయని తెలిపారు.

ఈ విషయాన్ని మేనేజర్ల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ.. ఎలాంటి చర్యలు తీసుకోలేదని వెల్లడించారు. నాణ్యతాపరమైన అంశాల్లో ఆరోపణలకు సంబంధించిన పలు కేసులు కోర్టు పరిధిలో ఉన్నాయి. వాటిలో భాగంగా గత మార్చిలో విచారణకు హాజరుకావాల్సిన బార్నెట్ హోటల్‌గదిలో విగత జీవిగా కనిపించారు. ఆ అనుమానాస్పద మృతిని తర్వాత ఆత్మహత్యగా నిర్ధారించారు. దాదాపు 32ఏళ్లపాటు కంపెనీలో పని చేసిన ఆయన 2017లో అనారోగ్య కారణాలతో ఉద్యోగ విరమణ చేశారు.



# హై ఓల్టేజ్ ఫైనల్ నేడే




- ఆసియా కప్ కోసం భారత్, పాక్ ఢీ
- టోర్నీలో ఇప్పటికే దాయాదిని రెండుసార్లు ఓడించిన టీమిండియా
- మూడోసారి ఓడించి కప్పు గెలవాలని అభిమానుల కోరిక

పాకిస్థాన్‌తో మ్యాచ్ అంటేనే భారత అభిమానులు ఒక యుద్ధంలా భావిస్తారు. అందులోనూ ఫైనల్‌లో భారత ప్రత్యర్థి పాకిస్థాన్ అయితే అభిమానులు మరింత ఉత్సాహంతో ఎదురుచూస్తారు. ఈ క్రమంలోనే దాయాది దేశాల మధ్య ఆసియా కప్ -2025 ఫైనల్ మ్యాచ్ రణరంగం సిద్ధమైంది. ఈ పోరులో భారత్, పాకిస్థాన్ జట్లు మునుపెన్నడూ లేనంత తీవ్రస్థాయిలో తలపడనున్నాయి. టోర్నీ లీగ్ దశలో, సూపర్ ఫోర్ మ్యాచ్‌లో రెండుసార్లు పాకిస్థాన్‌ను ఓడించిన భారత్.. ముచ్చటగా మూడోసారి కూడా ప్రత్యర్థిని మట్టికరిపించి కప్పును ముద్దాడేందుకు సిద్ధమవుతోంది.

ఆసియా కప్ చరిత్రలోనే మొదటిసారిగా ఈ రెండు దిగ్గజ జట్లు ఫైనల్లో ఆడటం క్రికెట్ ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తోంది. ఈ పోరు కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ఊపిరి బిగబట్టి ఎదురుచూస్తున్నారు.

### దుబాయ్ వేదికగా...

ఈ ఉత్కంఠభరిత మ్యాచ్ ఆదివారం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో రాత్రి 8 గంటలకు మొదలవుతుంది. దుబాయ్ స్పోర్ట్స్ సిటీలో ఉన్న ఈ స్టేడియం 25,000 సీటింగ్ కెపాసిటీ కలిగి ఉంది. అవసరమైతే 30,000 వరకు విస్తరించవచ్చు.

### జట్టు బలంగానే ఉన్నా..

ఆసియా కప్- 2025 టోర్నీ బరిలోకి దిగిన మిగతా జట్లతో పోలిస్తే టీమ్ ఇండియానే బలమైంది. ఫైనల్‌కూ అజేయంగా చేరుకుంది. ఈ ఎడిషన్‌లో మూడోసారి పాకిస్థాన్‌తో తలపడనుంది. ఇప్పటి వరకూ అంతా బాగానే ఉన్నా.. ఒకే ఒక్క అంశం కలవరపెడుతోంది. ఈసారైనా ఆ 'చరిత్ర'ను తిరగరాయాలనేది అభిమానుల ఆకాంక్ష. 41 ఏళ్ల ఆసియా కప్ చరిత్రలో తొలిసారి భారత్- పాకిస్థాన్ ఫైనల్లో తలపడుతున్నాయి. ఇప్పటికి ఎనిమిదిసార్లు భారత్ ఛాంపియన్‌గా నిలవగా.. పాకిస్థాన్ కేవలం రెండుసార్లే విజేతగా మారింది. ప్రస్తుత ఆసియా కప్ ఫైనల్లోనూ టీమ్ ఇండియానే ఫేవరెట్. కానీ, గతంలో యూఏఈలో ఫైనల్ మ్యాచుల ఫలితాలను చూస్తే కాస్త ఆందోళనకరమే. మరీ ముఖ్యంగా పాకిస్థాన్‌తో ఐసీసీ టోర్నీల్లో యూఏఈ గడ్డపై ఆడిన ఫైనల్ మ్యాచుల్లో భారత్‌కు పెద్దగా కలిసిరాలేదు. అలాగే మొత్తమ్మీద వివిధ టోర్నమెంట్లలో ఇరు జట్లు 10 సార్లు ఫైనల్స్‌లో తలపడితే.. టీమ్ ఇండియా కేవలం మూడుసార్లే విజయం సాధించింది.

### చివరిసారిగా ధోనీ నాయకత్వంలో..

కెప్టెన్ కూల్ ఎంఎస్ ధోనీ సారథ్యంలోని టీమ్ ఇండియా నెగ్గిన తొలి టీ20 ప్రపంచ కప్ ఫైనల్లో మన ప్రత్యర్థి పాకిస్థానే. చివరి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో పాక్‌ను చిత్తు చేసి భారత్ కప్పు గెలుచుకుంది. అంతకుముందు 1998లో ఇండిపెండెన్స్ కప్ ఫైనల్లోనూ భారత్ – పాక్ తలపడ్డాయి. ఇక్కడా సౌరభ్ గంగూలీ అదరగొట్టేయడంతో పాక్‌ను భారత్ అలవోకగా చిత్తు చేసింది. ఇక 1985లో వరల్డ్ ఛాంపియన్షిప్ ఆఫ్ క్రికెట్ టోర్నీ ఫైనల్లో పాక్‌ను ఓడించి భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. అయితే ఈ మూడు మ్యాచులు కూడా యూఏఈ అవల జరిగినవి కావడం గమనార్హం.

### ఏడుసార్లు కలిసిరాలేదు

మరో ఏడు టోర్నీల్లో భారత్‌పై పాక్ ఫైనల్లో విజయం సాధించింది. చివరిసారిగా 2017 ఛాంపియన్స్ ట్రోఫీలో మనల్ని ఓడించి పాక్ కప్పు సొంతం చేసుకుంది. 2008లో భారత్, పాక్, బంగ్లాదేశ్ ముక్కోణపు సిరీస్, 1999లో పెప్సీ కప్ తోపాటు కోకకోలా కప్, 1994లో ఆస్ట్రల్ కప్, 1991లో విల్స్ ట్రోఫీ, 1986లో ఆస్ట్రల్ కప్‌ను పాక్ సొంతం చేసుకుంది. ఇప్పుడు ఆసియా కప్‌లో తొలిసారి పాకిస్థాన్‌తో భారత్ ఫైనల్లో తలపడుతోంది. ఇందులో విజేతగా నిలిచి గత ఓటములకు ప్రతీకారం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

### అభిషేక్‌పైనే భారం..

### గాయం వార్తలతో ఆందోళన

అభిషేక్ శర్మ.. ఈ పేరు వింటేనే పాక్ కలవరపడుతోంది. ఈ టోర్నీలో టీమ్ ఇండియా ఓపెనర్ అదరగొడుతున్న విషయం తెలిసిందే. ప్రతి మ్యాచ్లో తన అద్భుత ఇన్నింగ్స్ కీలకంగా నిలుస్తున్నాడు. పాక్ పైనా దూకుడుగా ఆడేశాడు. షహీన్ వంటి అగ్రశ్రేణి పేసర్ బౌలింగ్లో తొలి బంతినే సిక్స్‌గా మలిచాడు. ఈ నేపథ్యంలో శ్రీలంకతో మ్యాచ్ సమయంలో అభిషేక్ శర్మకు గాయమనే వార్తలు వచ్చాయి. కానీ, అతడు సిద్ధమని కోచ్ చెప్పడంతో ఇప్పటికైతే అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. మ్యాచ్ సమయానికి ఏం జరుగుతుందో చూడాలి. ఈ క్రమంలో అభిషేక్ లేకున్నా.. మ్యాచ్‌లో ఉండి శుభారంభం ఇవ్వకున్నా తాము గెలిచేస్తామని పాక్ కలలు కంటోంది.

### టీ20ల్లో భారత్ జోరు

టీ20ల్లో భారత్ అద్భుతమైన ఆధిపత్యం చెలాయిస్తోంది. ఈ ఫార్మాట్‌లో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానంలో కొనసాగుతోంది. అభిషేక్ శర్మ వీరోచిత ఇన్నింగ్స్‌ల కంటే ముందే టీమిండియా పొట్టి ఫార్మాట్‌లో అగ్రస్థానంలో నిలిచింది. 2024లో 24 మ్యాచ్‌లో ఆడితే.. కేవలం రెండింటిలో మాత్రమే ఓడింది. విజయశాతం 92.31%గా ఉంది. అప్పటికి అభిషేక్ జట్టులో లేడు. అయినా సరే భారత్‌ను ప్రత్యర్థులు ఓడించలేకపోయారు.

### జోరుమీద టీమిండియా

ఇక ఈ ఆసియాకప్‌లో అభిషేక్ శర్మ టీమ్ ఇండియాకు గొప్ప ఆరంభాలను అందిస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన 6 ఇన్నింగ్స్ లో 309 పరుగులతో టోర్నీ టాప్ స్కోరర్ గా కొనసాగుతున్నాడు. సూపర్-4 మ్యాచ్లో వరుసగా 74, 75, 61 పరుగులు సాధించాడు. ప్రతి ఇన్నింగ్స్ లోనూ 30కి పైగా పరుగులు రాబట్టాడు. మరో ఓపెనర్ శుభమన్ గిల్ అతడికి సహకారం అందిస్తున్నాడు. ఇక కెప్టెన్ సూర్యకుమార్ సారథ్య బాధ్యతల ఒత్తిడిలో బ్యాటింగ్లో కాస్త తడబడుతున్నప్పటికీ.. అతడు విజృంభిస్తే ఎలాంటి బౌలర్లకైనా అడ్డుకోవడం కష్టమే. ఫైనల్లో అతడి నుంచి మంచి ప్రదర్శన రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. మరోవైపు మిడిలార్డర్‌లో తిలక్‌వర్మ రాణిస్తున్నాడు. సంజూ శాంసన్ బ్యాటింగ్ ఆర్డర్లో దిగువకు వస్తుండటం కాస్త ప్రభావం చూపించే అంశం. అయితే, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాడు. శ్రీలంకతో మ్యాచ్‌లో తిలకవర్మతో కలిసి సంజు మిడిలార్డర్లో కీలక భాగస్వామ్యం నిర్మించాడు. దీంతో అభిషేక్ శర్మ లేకుంటే టీమ్ ఇండియాను ఎదుర్కోవచ్చన్న పాక్ ఆశలు అడియాశలే అవుతాయని విశ్లేషకులు అంటున్నారు.

### బౌలింగ్‌లోనూ టాప్

ఇక బౌలింగ్‌లో కుల్‌దీప్ యాదవ్ సత్తా చాటుతున్నాడు. వరుణ్ చక్రవర్తి కూడా అతడికి సహకారం అందిస్తున్నాడు. బంగ్లాతో జరిగిన సూపర్ -4 మ్యాచ్లో భారత్ 168 పరుగుల లక్ష్యాన్ని కాపాడటంలో వీరు కీలక పాత్ర పోషించారు. ఒక్కోసారి బుమ్రా ప్రభావాన్ని చూపించకపోయినా.. ఆల్ రౌండ్ కోటాలో హార్దిక్ పాండ్య, శివమ్ దూబే ఆ లోటును పూరిస్తున్నారు. ఇక ఫైనల్లో ముచ్చటగా మూడోసారి పాక్‌ను ఓడించి.. టైటిల్ గెలిచి దాయాది దేశానికి గట్టి బుద్ధి చెప్పాలని అభిమానులు కోరుకుంటున్నారు.

---

## పారా ఆర్చరీ ప్రపంచ చాంపియన్ షిప్‌లో
# శీతల్‌కు స్వర్ణం

దక్షిణ కొరియాలో జరుగుతున్న పారా ఆర్చరీ ప్రపంచ చాంపియన్ షిప్‌లో కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించి 18 ఏళ్ల శీతల్ చరిత్ర సృష్టించింది. ఫైనల్లో తుర్కియేకు చెందిన వరల్డ్ నెం.1 ఓజ్నూర్ క్యూర్ గిర్డిపై 146-143 తేడాతో విజయంసాధించి,స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. అలాగే పురుషుల విభాగంలో తోమన్ కుమార్ విజేతగా నిలిచాడు. అంతకు ముందు శీతల్, తోమన్ కుమార్‌తో కలిసి కాంపౌండ్ ఈవెంట్లో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్య పతకం గెలుచుకుంది. గ్రేట్ బ్రిటన్‌కు చెందిన జోడీ గ్రీన్హామ్, నాథన్ మాక్ క్వీన్‌ను 152-149 తేడాతో ఓడించారు. కాంపౌండ్ మహిళల ఓపెన్ టీమ్ ఈవెంట్లో, ఫైనల్లో తుర్కియే చేతిలో ఓడిపోయిన తర్వాత శీతల్, సరిత రజతంతో సరిపెట్టుకున్నారు.

అలాగే రాకేశ్ కుమార్ కాంపౌండ్ మెన్స్ విభాగం ఫైనల్లో 40-20 తేడాతో ఓడిపోయాడు. సాంకేతిక కారణాలతో అతడు వైదొలాగాల్సి రావడంతో తోమన్ కాంపౌండ్ పురుషుల టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. పారిస్ పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత రాకేశ్ నాలుగు షాట్స్ అనంతరం తన విల్లులో సమస్యతో పోటీ నుంచి వైదొలిగాడు. దీంతో తోమన్ నాలుగు సార్లు సరిగ్గా లక్ష్యాన్ని ఛేదించి ఈ విభాగంలో వరల్డ్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు.



# రికార్డు సృష్టించిన నిస్సాంక

టీమిండియాతో ఆసియా కప్–2025 సూపర్-4 మ్యాచ్లో.. శ్రీలంక ఓపెనర్ పాతుమ్ నిస్సాంక అద్భుత ప్రదర్శన కనబరిచాడు. మొత్తంగా 58 బంతులు ఎదుర్కొని 107 పరుగులు సాధించాడు. అతడి ఇన్నింగ్స్ లో ఏడు ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో టీమిండియాతో మ్యాచ్ సందర్భంగా నిస్సాంక ఆసియా కప్ టీ20 టోర్నీలో సరికొత్త చరిత్ర లిఖించాడు. ఈ టోర్నమెంట్ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా ఘనత సాధించాడు. ఈ క్రమంలో భారత దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లి పేరిట ఉన్న రికార్డును నిసాంక బద్దలు కొట్టాడు. విరాట్ కోహ్లి 9 ఇన్నింగ్స్ లో 429 పరుగులు పరుగులు చేయగా, పాతుమ్ నిసాంక 12 ఇన్నింగ్స్‌లో 434 పరుగులు చేశాడు.


# షూటింగ్ జూనియర్ ప్రపంచకప్ టోర్నీలో జొనాథన్‌కు స్వర్ణం



ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నీలో రెండో రోజు భారత్‌ను రెండు పతకాలు లభించాయి. జూనియర్ పురుషుల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో జొనాథన్ గావిన్ ఆంటోనీ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకోగా... జూనియర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో రష్మిక సెహగల్ రజత పతకాన్ని దక్కించుకుంది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో జొనాథన్ 244.8 పాయింట్లు స్కోర్‌చేసి అగ్రస్థానంలో నిలిచాడు. అరిగి లుకా(ఇటలీ 236.3 పాయింట్లు) రజతం, లుకాస్ సాంచెజ్ (స్పెయిన్ 215.1పాయింట్లు) కాంస్యం గెల్చుకున్నారు. భారత్‌కు చెందిన చిరాగ్ శర్మ 115.6 పాయింట్లతో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అంతకుముందు 21 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో జొనాథన్ 586పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో, చిరాగ్ శర్మ 578 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో నిలిచారు, మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్‌ఫైనల్లో భారత్‌నుంచి ముగ్గురు రష్మిక సెహగల్, వర్షిక, మోహిని సింగ్ బరిలోకి దిగారు.రష్మిక 236.1 పాయింట్లతో రెండో స్థానంలో రజతపతకాన్ని సొంతం చేసుకుంది. వర్షిక 174.2 పాయింట్లతో ఐదో స్థానంలో, మోహిని 153.7 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచారు. రెండో రోజు పోటీలు ముగిశాక భారత్ 2 స్వర్ణాలు, 3 రజతాలు, 2 కాంస్యాలతో కలిపి ఏడు పతకాలతో టాప్ ర్యాంక్లో ఉంది.

# కె-ర్యాంపు అంటే..

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న 11వ చిత్రం 'కె-ర్యాంప్'. జైన్స్ నాని దర్శకుడు. దీపావళి కానుకగా అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా టీమ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. అందులో సినిమా టైటిల్ అర్థాన్ని దర్శకుడు జైన్స్ నాని వివరించారు. "కె ర్యాంప్' అంటే అసభ్యపదం అనుకుంటున్నారు. దాని అర్థం కిరణ్ అబ్బవరం ర్యాంప్. ఆయన్ని దృష్టిలో పెట్టుకొనే స్క్రిప్ట్ రాశాను. సినిమాను పూర్తి చేశాను. ఈ సినిమాలో హీరో పేరు కుమార్.. అందుకే 'కె-ర్యాంప్' అని పెట్టాం" అని వివరించారు. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ దర్శకుడు మహేశ్‌బాబు ఫ్యాన్ అని తెలిపారు. "జైన్స్ నాని నాకు కథ చెప్పినప్పుడు రెండున్నర గంటలు నవ్వుతూనే ఉన్నాను. షూటింగ్ సరదాగా సాగింది. ఎందుకంటే దర్శకుడేమో మహేశ్ అభిమాని.. నేనేమో పవన్ కల్యాణ్ అభిమానిని. వీళ్ల ఫ్యాన్స్ సినిమా తీస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది చిత్రం. థియేటర్‌లో కూర్చుని నవ్వుకునే వైబ్ ఉన్న సినిమా ఇది. ఈ సినిమా విజయం సాధిస్తుందా? లేదా? అనేది పక్కన పెడితే నాకు నాని రూపంలో మంచి బ్రదర్ దొరికాడు. లైఫ్‌లోనిని ఎప్పుడు చూసినా నవ్వుతూనే ఉంటాను. సెట్‌కు వెళ్లగానే ఇద్దరం ఒకరిని ఒకరం చూసుకొని 20 నిమిషాలు నవ్వుకునే వాళ్లం. ఇది రిలీజ్ అయ్యాక ఆడియన్స్ కూడా అలానే నవ్వుతారు" అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నటుడు నరేశ్ మాట్లాడుతూ.. "దర్శకుడు జైన్స్ నాని ఈ కథ చెప్పగానే, రెండే రెండు మాటలు చెప్పా. 'నువ్వు చాలా పెద్ద డైరెక్టర్ అవుతావు. ఈ మూవీ బ్లాక్‌బస్టర్ హిట్ అని అన్నాను. చేతన్ భరద్వాజ్ మంచి సంగీతం అందించారు. ఇందులో మాటలకన్నా బాంబులే ఎక్కువ పేలుతాయి. నిర్మాత రాజేశ్ దండ హ్యాట్రిక్ కొడతాడు. కథానాయిక యుక్తి తరేజ్‌కు మంచి భవిష్యత్ ఉంది. ఈ సినిమా తర్వాత వరుస అవకాశాలు వస్తాయి. జైన్స్ నాని పేరు ఒక బ్రాండ్ అవుతుంది. యువత ఆయన పేరు చూసి సినిమాలకు వస్తారు. ఇక హీరో కిరణ్ అబ్బవరం చాలా సింపుల్‌గా ఉంటాడు. ఈ సినిమా తరువాత మంచిస్థాయికి వెళ్తాడు' అన్నారు.




# జాన్‌కు జోడీగా మీనాక్షి..





లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతో మంచి హిట్ అందుకున్న మీనాక్షి చౌదరి టాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుం టోంది. ఇప్పుడు ఆమె బాలీవుడ్‌లో కూడా ఎంట్రీ ఇచ్చేం దుకు రెడీ అవు తుంది. జాన్ అబ్రహం హీరోగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'ఫోర్స్-3'లో మీనాక్షి హీరోయిన్‌గా ఎంపికైంది. భావ్ ధూలియా దర్శ కత్వం వహిస్తున్న చిత్రానికి గత కొంతకాలంగా ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. లుక్ టెస్ట్ తర్వాత మీనాక్షి ఫైనల్ అయినట్టు తెలుస్తోంది. ఇక ఈ చిత్రం షూటింగ్ మొదలయ్యే ముందు ఆమెకు ప్రత్యేక శిక్షణ ఇవ్వను న్నట్టు తెలుస్తోంది. 'ఫోర్స్-3' నవంబర్ లో సెట్స్‌పైకి వెళ్లి, వచ్చే ఏడాది విడుదల కానుంది. ఇదిలా ఉండగా, మీనాక్షి ప్రస్తుతం నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న 'అనగనగా ఒక రాజు' చిత్రంలో బిజీగా ఉంది. ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా జనవరి 14న రిలీజ్ కానుంది.

# శికంజ మాలిక్‌గా మోహన్‌బాబు

కథానాయకుడు నాని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరోసారి ప్రేక్షకులను అలరించేం దుకు సిద్ధమైన విషయం తెలిసిందే. 'ది ప్యారడైజ్' అంటూ విభిన్నకథతో రానున్నా రు. సినిమాలో అగ్రనటుడు మోహన్‌బాబు ఉన్నట్టు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన లుక్‌ను రిలీజ్‌చేశారు. ఇందులో మోహన్‌బాబు 'శికంజ మాలిక్'గా కనిపించనున్నట్టు చెబు తూ పోస్టర్ విడుదలచేశారు. షర్ట్ లేకుండా గన్,కత్తి పట్టుకుని సిగార్ కాలుస్తూ రగ్గడ్ లుక్‌లో మోహన్‌బాబు కనిపిస్తున్నారు. ఆయన పవర్‌ఫుల్ విలన్‌గా నటిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇక ఇందులో నాని కూడా ఇప్పటివరకూ చూడని డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్న విషయం తెలిసిందే. నాని 'జడల్'పాత్రలో కనిపించ నున్నారు.వచ్చేఏడాది మార్చి 26న సినిమా ప్రేక్షకులను పలకరించనుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీతో పాటు... మొత్తం 8భాషల్లో సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. తిరుగుబాటు, నాయకత్వంతో పాటు తల్లీకొడుకుల అనుబంధం కథకు కీలకంగా నిలవనున్నట్టు ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతుంది.



## నేనూహించని టర్న్ ఇది

'కాంతార చాప్టర్-1'తో ప్రేక్షకులను పలక రించేందుకు సిద్ధమయ్యారు నటి రుక్మిణి వసంత్. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రానున్న చిత్రం అక్టోబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది.ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. "నేను నటించిన 'సప్తసాగరాలు దాటి', 'ఏస్' చిత్రాలను రిషబ్ శెట్టి చూశారు. వాటి ప్రీమియర్స్‌కు వచ్చి నా నటనను మెచ్చు కున్నారు. 'కాంతార చాప్టర్-1'లో నటించే అవకాశం వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. ఇదంతా ఆయన నా ప్రేమి యర్స్ చూసి ఇందులో ఛాన్స్ ఇచ్చారని నేను భావిస్తున్నా. కాంతార టీమ్ నాకు ఫోన్ చేసి ఇందులో భాగం అవుతారా? అని అడిగినప్పుడు నాఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. ఈ సినిమా 4, 5 శతాబ్దాల మధ్య జరిగే కథ.అప్పటి పరిస్థితులకు తగి నట్టు వాటిని అర్థం చేసుకుంటూ నటించా లి. అలాగే దీనికోసం గుర్రపు స్వారీ, కత్తి యుద్ధాలలో శిక్షణ పొందడం ఎంతో సరదాగా అనిపించింది. కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేశాను" అని రుక్మిణి తెలి పారు. కొన్నిసందర్భాల్లో రిషబ్‌శెట్టిని చూసి ఆశ్చర్యపోయినట్టు తెలిపారు. నటు డిగా, దర్శకుడిగా ఆయన ప్రతి విష యాన్ని క్షుణంగా పరిశీలిస్తారని ప్రశం సలు కురిపించారు. ఇక తాను ఎన్టీఆర్ -ప్రశాంత్ నీల్ కాంబోలో రానున్న సినిమా, యశ్ టాక్సిక్ గురించి ఇప్పుడే ఏం చెప్పలేనని అన్నారు. తాను కెరీర్‌లో ఏ ఆఫర్‌నూ వదులుకోలేనని చెప్పారు.

# దేవర-2.. సన్నద్ధంకండి




ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'. గతేడాది సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకువచ్చిన సినిమా ఎన్టీఆర్‌లోని మాస్‌ను ప్రేక్షకులకు పరిచయం చేసింది. 'దేవర విడుదలై ఏడాది అయిన సందర్భంగా నిర్మాణసంస్థ దీని సీక్వెల్ పోస్టర్‌ను విడుదల చేసింది. అందరూ 'దేవర-2' కోసం సిద్ధంగా ఉండాలని పేర్కొంది. "దేవర ప్రతి సముద్ర తీరాన్ని వణికించి నేటికి ఏడాది పూర్తయింది. ప్రపంచం ఎప్పటికీ గుర్తు పెట్టుకునే పేరు ఇది. తాను పంచిన ప్రేమ, తాను చూపిన భయం.. ఎప్పటికీ మర్చిపోలేరు. దేవర-2' కోసం అందరూ సిద్ధంగా ఉండండి" అని నిర్మాణసంస్థ ఒక పోస్ట్ పెట్టింది. దీంతో త్వరలోనే సీక్వెల్ పనులు ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది.ప్రస్తుతం ఎన్టీఆర్.. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. ఇప్పటికే పలు షెడ్యూళ్లు పూర్తి చేసుకున్న ఈ చిత్రం 2026 జూన్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని షూటింగ్ పూర్తికాగానే ఎన్టీఆర్ 'దేవర-2'లో నటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'దేవర 2'పై కొరటాల గతంలో కొన్ని ఇంటర్వ్యూల్లో మాట్లాడి అంచనాలు పెంచేశారు. మొదటిభాగం కంటే రెండో భాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని వెల్లడించారు. పార్ట్-1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు. ఎన్టీఆర్ కూడా సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. మొదటి భాగం విజయం సాధించడంతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. 'దేవర'కంటే దాని సీక్వెల్ ఇంకా బాగుంటుందని పలు సందర్భాల్లో వెల్లడించారు.

# అదిరా.. గొలుసు వెనుక కథ

ఇటీవల జరిగిన జాతీయ చలన చిత్ర పురస్కారాల వేడుకలో నటి రాణీ ముఖర్జీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సంగతి తెలిసిందే. తన కుమార్తె అదిరా పేరుతో ఉన్న గొలుసును రాణి వేసుకున్నారు. ఈ వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తాజాగా ఆ గొలుసు వేసుకోవడంపై ఆమె స్పందించారు. తన కుమార్తెను వేడుకకు అనుమతించలేదని దీంతో ఆమె రాలేకపోయిందన్నారు. అందుకే ఆమె తనతో ఉన్నట్టు అనిపించడం కోసం ఆమె పేరుతో గొలుసు తయారు చేయించుకొని వేసుకున్నట్టు తెలిపారు. "నేను అవార్డు తీసుకునేటప్పుడు చూడాలని అదిరా ఎంతో ఆశ పడింది. కానీ, వేడుకకు 14 ఏళ్లలోపు పిల్లలకు అనుమతి లేదు. దీంతో ఆమె రాలేకపోయింది. నాకెంతో ప్రత్యేకమైన రోజు నా పక్కన ఉండలేకపోయింది. అందుకే తన పేరు మీద గొలుసు చేయించుకున్నా. అదిరా నా అదృష్టం. ఇన్‌స్టాలో ఈ విషయంపై చాలామంది రీల్స్ చేశారు. 'రాణి తన కుమార్తెను వెంట తీసుకువెళ్లారు' అంటూ గొలుసును హైలైట్ చేస్తూ సోషల్ మీడియాలో చాలా వీడియోలు వైరల్ అయ్యాయి. వాటిని మా అమ్మాయికి చూపించా. ఆమె చాలా ఆనంద పడింది. ఆ రీల్స్ చేసిన వారందరికీ ధన్యవాదాలు" అని రాణి తెలిపారు. 2023లో విడుదలైన 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' సినిమాకుగాను రాణీ ముఖర్జీ ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సబ్యసాచి డిజైన్ చేసిన హెరిటేజ్ చీరలో హాజరయ్యారు. మెడలో తన కుమార్తె పేరుతో ఉన్న గొలుసును వేసుకున్నారు.



# 20నిమిషాల్లో రాసిన సీన్ అది..

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు షారుక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్ దర్శకుడిగా పరిచయమైన సిరీస్ 'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్'. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. సిరీస్‌లో దర్శకుడు రాజమౌళి, హీరో ఆమిర్‌ఖాన్ అతిథి పాత్రల్లో కనిపించిన విషయం తెలిసిందే. తాజాగా వారి సన్నివేశం గురించి నటి అన్య ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఆ సన్నివేశం ముందుగా ప్లాన్ చేసుకున్నది కాదని.. అప్పటికప్పుడు అనుకొని రాసినదని చెప్పారు. ఆర్యన్ 20 నిమిషాల్లో దీన్ని రాశారని తెలిపారు. "ముంబయిలోని ఓ స్టూడియోలో మేం చిత్రీకరణ చేస్తున్నాం. రాజమౌళి, ఆమిర్లు స్టూడియోకు వారి ప్రాజెక్ట్ కోసం వచ్చారని ఆర్యన్‌కు తెలిసింది. తాను 20 నిమిషాల్లో ఒక సన్నివేశం రాస్తానని మమ్మల్ని కాస్ట్యూమ్స్ మార్చుకోమని కోరారు. మేం సిద్ధమై వచ్చేసరికి ఆర్యన్ వాళ్లను ఒప్పించడం.. సన్నివేశం వివరించడం అన్నీ అయిపోయాయి. అలా అప్పటికప్పుడు ఆర్యన్ సన్నివేశం రాయడం.. వారు అతిథి పాత్రల్లో మెరవడం అన్నీ పూర్తయ్యాయి" అని ఈ సిరీస్‌లో కీలకపాత్ర పోషించిన అన్య సింగ్ తెలిపారు. బాలీవుడ్‌లో తొలి ప్రయత్నంలోనే హిట్‌కొట్టిన హీరో జీవితంలో ఎలాంటి మార్పులొచ్చాయన్న కథాంశంతో 'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' రూపొందింది. ఈనెల 18న ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది.

